

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY


తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 01-03-2026 | సంపుటి - 26 | సంచిక -280 | రూ : 4 | పేజీలు: 8


## శారదా పీఠం భూములపై హైడ్రామా

- తమకు ప్రభుత్వం కేటాయించిందని జలమండలి ప్రకటన
- స్వాధీనానికి వెళ్లిన అధికారులు
- విషయం తెలిసి అక్కడికి చేరుకున్న హరీశ్‌రావు.. ప్రభుత్వంపై మండిపాటు
- సాయంత్రం ఉన్నతాధికారులతో సీఎం భేటీ.. జలమండలికి ఇవ్వాలన్న నిర్ణయం రద్దు
- అక్కడ నిర్మాణాలున్నట్లు ఎందుకు చెప్పలేదని అధికారులపై ఆగ్రహం



2లో



## మార్చి 6 నుంచి జూన్ 12 వరకు
# 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'

- పౌరసేవలను సులభతరం చేయడంపై జయేశ్‌రంజన్ ఆధ్వర్యంలో ఏకసభ్య కమిటీ
- ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రజలు కోరుకున్న మార్పును స్వాగతిస్తున్నందునే వరుస ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని, వారికి మరింత మంచి చేసేందుకు ముందుకు సాగుతూ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రజలకు కోరుకున్న మార్పును అందిస్తామనే హామీతోనే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల మూడు నెలలైందని చెప్పారు. ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయతీగా అంచనా వేసుకుని, ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో గుర్తించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. మిగిలిన రెండేళ్ల తొమ్మిది నెలల పరిపాలన కాలంలో చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో తరువాయి 2లో



## దేశవ్యాప్తంగా మొదలైన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

- అజ్మేర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ

2లో

## సోలార్ బెంబేలు

- ట్రంప్ సుంకాల దెబ్బతో ప్రత్యామ్నాయ మార్కెట్ల వైపు చూపులు
- సమస్యల సుడిగుండంలో భారత సోలార్ తయారీదారులు
- భారీగా పెరిగిన ముడిసరుకు ధరలు
- కొంపముంచిన పీఎల్ఐ పథకం
- డిమాండ్‌కు మించి సోలార్ మాడ్యూల్స్ సరఫరా

2లో






# యుద్ధ జ్వాల

- ఇరాన్‌పై విరుచుకుపడిన అమెరికా, ఇజ్రాయెల్
- ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్ లక్ష్యంగా ఇరాన్ క్షిపణుల వర్షం
- 201 మంది మృతి.. అందులో 86 మంది విద్యార్థినులే..
- ఇరాన్ రక్షణ మంత్రి, ఐఆర్‌జీ కమాండర్ సైతం హతమైనట్లు రాయిటర్స్ కథనం
- దేశాన్ని స్వాధీనం చేసుకోవాలని ఇరానీయులకు ట్రంప్ పిలుపు
- పశ్చిమాసియా, గల్ఫ్‌లకు వేల కొద్దీ విమాన సర్వీసుల రద్దు

2లో

## పాక్ నేతలు గ్రేట్
# ట్రంప్ ప్రశంసలు

- ఘర్షణలో తలదూర్చబోనని స్పష్టీకరణ



వాషింగ్టన్ : పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలో తలదూర్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. పాకిస్తాన్‌తో తనకు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఆ దేశం పనితీరు చాలా బాగుందని వ్యాఖ్యానించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌పై ఆయన ప్రశంసలు కురిపించారు. 'నేను పాకిస్తాన్‌తోనే ఉన్నాను. వారికి ఓ గొప్ప ప్రధాని, ఓ గొప్ప సైనాధ్యక్షుడు ఉన్నారు' అని విలేకరులతో అన్నారు.

తరువాయి 2లో

## ఖమేనీ చనిపోయినట్లే..!

- ఆ మేరకు సంకేతాలున్నాయి.. నెతన్యాహు వ్యాఖ్య

2లో



## పెట్టుబడిదారులు..
## రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు




- రాంబిల్లిలో బ్లూజెట్ హెల్త్‌కేర్ యూనిట్‌కు శంకుస్థాపన
- ఉత్తరాంధ్రను ఎకనమిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం
- మంత్రి నారా లోకేశ్ వెల్లడి

అనకాపల్లి: 'ఒకసారి మా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న తర్వాత అది మీ ప్రాజెక్టు కాదు.. మా సొంత ప్రాజెక్టుగా భావిస్తాం. పెట్టుబడిదారులను బయట వ్యక్తుల్లా కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా చూస్తాం' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెంలో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్‌కు శనివారం లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు తరువాయి 2లో

## మృతుల కుటుంబాలకు
# రూ.20 లక్షల చొప్పున పరిహారం

- కేంద్రం నుంచి మరో రూ.2 లక్షల సాయం
- ఆర్డీఓ, డీఎస్పీ, అగ్నిమాపక, కార్మికశాఖ అధికారుల సస్పెన్షన్
- సీఎం చంద్రబాబు ప్రకటన
- కాకినాడ జీజీహెచ్‌లో బాధితులకు పరామర్శ
- చీకటిలోనూ ఘటనాస్థలికి వెళ్లి పరిశీలన

2లో



# మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక'

హైదరాబాద్: ప్రజలు కోరుకున్న మార్పును స్వాగతిస్తున్నందునే వరుస ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి మద్దతుగా నిలిచారని, వారికి మరింత మంచి చేసేందుకు ముందుకు సాగుతూ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. పారదర్శకత, జవాబుదారీతనంతో ప్రజలకు కోరుకున్న మార్పును అందిస్తామనే హామీతోనే ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల మూడు నెలలైందని చెప్పారు. ఇప్పటివరకు సాధించిన విజయాలను నిజాయతీగా అంచనా వేసుకుని, ఎక్కడ లోటుపాట్లు ఉన్నాయో గుర్తించాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారు. మిగిలిన రెండేళ్ల తొమ్మిది నెలల పరిపాలన కాలంలో చేపట్టాల్సిన పనులపై కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. శనివారం సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డితోపాటు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నాం. గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి వరకు మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజులపాటు ఈ ప్రణాళికను అమలు చేయాలి. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని దీనిని బాధ్యతగా నిర్వర్తించాలి. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయాలి. రాష్ట్రమంతటా 99 రోజులపాటు నిర్వహించాల్సిన ప్రత్యేక కార్యక్రమాలపై సీఎస్ షెడ్యూల్ రూపొందించాలి. రాబోయే 99 రోజులూ దస్త్రాల పరిష్కారంపై కార్యాలయాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి. 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' పురోగతిని వ్యక్తిగతంగా నేనే రోజూ పరిశీలిస్తాను. క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తాను. అధికారుల పనితీరులో లోపాలను సహించను.

**ఎంవోయూలన్నీ కార్యరూపం దాల్చాలి**

తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు జోన్లుగా విభజించి దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాం. కోర్ అర్బన్ రీజియన్‌లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలి. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు ఉన్న పెరీ అర్బన్ రీజియన్ భవిష్యత్తులోనూ దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌తోపాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి దాదాపు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఎంవోయూలన్నీ కార్యరూపం దాల్చే వరకు పారిశ్రామికవేత్తలతో సంప్రదింపులు జరపాలి. ఈ పెట్టుబడులన్నీ సాకారమైతే తెలంగాణ పారిశ్రామిక రంగం ఆశించిన లక్ష్యం నెరవేరుతుంది. దేశ ఆర్థికస్థితిని మార్చబోతున్న ఫ్యూచర్ సిటీ నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు.

# యుద్ధ జ్వాల

వాషింగ్టన్: పశ్చిమాసియాలో మరో భీకర యుద్ధం మొదలైంది. గల్ఫ్ అంతటా యుద్ధాగ్ని జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఇరాన్ లక్ష్యంగా శనివారం అమెరికా, ఇజ్రాయెల్ భారీ దాడులకు దిగాయి. దీనికి ప్రతిగా గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకున్నాయి. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పేరుతో అగ్రరాజ్యం చేపట్టిన ఈ దాడులతో దేశమంతా అట్టుడికింది. ఈ దాడుల్లో ఇరాన్ రక్షణశాఖ మంత్రి అమీర్ నసీర్జాదే, రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ మహమ్మద్ పాక్‌పౌర్ మృతి చెందినట్లు రాయిటర్స్ పేర్కొంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. దక్షిణ ఇరాన్‌లోని ఓ పాఠశాలపై బాంబులు పడటంతో 86 మంది విద్యార్థినులు మరణించారు. వారితోపాటు ఇరాన్‌లో మొత్తం 201 మంది మరణించారు. 747 మంది గాయపడ్డారని రెడ్ క్రెసెంట్ వెల్లడించింది. ఇరాన్ ప్రతి దాడుల కారణంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో (యూఏఈ) ఒకరు మృతి చెందారు. ఇజ్రాయెల్‌లో 94 మంది స్వల్పంగా గాయపడ్డారు. యుద్ధం మొదలు కావడంతో పశ్చిమాసియాకు వేలకొద్దీ విమానాలు రద్దయ్యాయి. దేశాన్ని 1979 నుంచి పాలిస్తున్న ఇస్లామిక్ నాయకత్వం నుంచి మీ దేశాన్ని ఆధీనంలోకి తీసుకోవాలని ఇరాన్ ప్రజలకు ట్రంప్ పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రజలు తమ తలరాతను తామ చేతుల్లోకి తీసుకునేందుకు ఈ దాడులు చేస్తున్నామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వ్యాఖ్యానించారు. దేశం ఇటువంటి దాడులను ఉపేక్షించబోదని, దేశాన్ని రక్షించుకునే సమయం వచ్చిందని, శత్రువు సైన్యాన్ని ఎదుర్కొనే అవకాశం వచ్చిందని ఇరాన్ విదేశాంగశాఖ ప్రకటించింది. రెండు పక్షాలు సమన్వయం పాటించాలని ప్రపంచ దేశాలు పిలుపునిచ్చాయి. యుద్ధాన్ని విరమించి, చర్చలు జరపాలని భారతదేశం పిలుపునిచ్చింది.

**పగలే అమెరికా దాడులు..**

గతానికి భిన్నంగా ఈసారి పగటి వెలుగులోనే అమెరికా దాడులకు దిగింది. శుక్రవారం వారాంతపు సెలవు అనంతరం ఇరాన్‌లో లక్షల మంది శనివారం ఉదయం యథావిధిగా పనులకు, పాఠశాలలకు వెళ్లారు. స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.27 గంటల సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగాయి. తొలుత సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ ఇళ్లు, కార్యాలయాల చుట్టుపక్కల దాడులు జరిగాయి. దీంతో టెహ్రాన్ వ్యాపార కేంద్రంలోని ఖమేనీ ప్రాంగణానికి వెళ్లే దారులన్నింటినీ మూసివేశారు. ఆ తర్వాత దేశమంతా బాంబుల వర్షం కురిసింది. ఇరాన్ సైన్యం, ప్రభుత్వ, నిఘా కార్యాలయాలపై దాడులు జరిగాయి. 8 నెలల్లో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు దిగడం ఇది రెండోసారి.

# మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం

రాజమహేంద్రవరం: కాకినాడ జిల్లా వేట్లపాలెం బాణసంచా ప్రమాదంలో చనిపోయినవారి కుటుంబాలకు రూ.20 లక్షల చొప్పున పరిహారం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 లక్షల పరిహారం ఇవ్వనుందన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను శనివారం రాత్రి పరామర్శించిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'జరిగిన ఘటన చాలా దురదృష్టకరం. బాధితులంతా బడుగు బలహీనవర్గాలకు చెందినవారే. అందులో 12 మంది ఎస్సీలు, 8 మంది మహిళలు ఉన్నారు. ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకుంటున్నాం. ఇటీవల ఒక ఘటన జరిగింది. దానిపై విచారణ చేసి చర్యలు తీసుకోమని ఆదేశించాం. అయినప్పటికీ మళ్లీ మరోసారి ఇటువంటివి చోటుచేసుకోవడం విచారకరం. గాయపడ్డవారికి మెరుగైన చికిత్సకు అన్ని చర్యలు తీసుకొంటున్నాం. ఇందులో ఓ భార్యా భర్త కూడా చనిపోయారు. చనిపోయినవారి పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిస్తాం' అని హామీ ఇచ్చారు.

**నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు**

'బాణసంచా తయారీలో వాడే సామగ్రి చాలా ప్రమాదకరమైనది. ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణం. సాంకేతికంగానూ దీనిపై విచారణ జరగాలి. ఈ ఘటనకు బాధ్యులను చేస్తూ ఆర్డీవో, డీఎస్పీ, జిల్లా కార్మికశాఖ అధికారి, అగ్నిమాపకశాఖ అధికారిని సస్పెండ్ చేస్తున్నాం. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తాం. మిగిలిన బాధ్యులపైనా చర్యలు ఉంటాయి. సంబంధిత యజమాని ఎక్కడ ఉన్నా పట్టుకొని చట్టరీత్యా చర్యలు తీసుకొంటాం. అవసరమైతే ఆయన ఆస్తులు జప్తు చేసి, బాధితులకు అందజేస్తాం. బాధితుల్లో చాలామంది తమకు ఊహ తెలిసినప్పటి నుంచి ఇక్కడే పని చేస్తున్నామని తెలిపారు. రోజుకు రూ.700 వస్తుందని, అదే ఉపాధి పనిలో రూ.300 మాత్రమే వస్తుందని చెబుతున్నారు. 'నరేగాలో 125 రోజులు పని కల్పిస్తున్నాం. ఈ ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ చేయిస్తాం' అని ముఖ్యమంత్రి అన్నారు. సీఎం వెంట మంత్రులు అనిత, కందుల దుర్గేష్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీలు సానా సతీష్, ఉదయశ్రీనివాస్, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

# పెట్టుబడిదారులు.. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు

అనకాపల్లి: 'ఒకసారి మా ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న తర్వాత అది మీ ప్రాజెక్టు కాదు.. మా సొంత ప్రాజెక్టుగా భావిస్తాం. పెట్టుబడిదారులను బయట వ్యక్తుల్లా కాకుండా అభివృద్ధి భాగస్వాములుగా చూస్తాం' అని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సీతపాలెంలో ప్రముఖ ఫార్మా సంస్థ బ్లూ జెట్ హెల్త్ కేర్ యూనిట్‌కు శనివారం లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'ఉత్తరాంధ్ర పారిశ్రామికాభివృద్ధిలో ఈ పరిశ్రమ ఏర్పాటు ఓ మైలురాయి. ఆధునిక ఫార్మాస్యూటికల్ రంగంలో రాష్ట్రాన్ని మరింత కీలక గమ్యస్థానంగా మారుస్తుంది. బ్లూ జెట్ హెల్త్‌కేర్ సంస్థ రూ.2,300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమతో 1750 మందికి ప్రత్యక్షంగా, 250 మందికి పరోక్షంగా ఉద్యోగాలు లభిస్తాయి. యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుంది. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా అమలుకు ప్రాధాన్యం ఇస్తున్నాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

* **మాటిస్తే నిలబెట్టుకుంటాం**

'ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత ఉంది. మన రాష్ట్రం మాట ఇస్తే నిలబెట్టుకుంటుందని పెట్టుబడిదారులు నమ్ముతున్నారు. అదే మన బలం. రాష్ట్రానికి ప్రాజెక్టులు వస్తే.. కాగితాలకే పరిమితం కాకుండా త్వరితగతిన గ్రౌండింగ్ అవుతున్నాయి. బ్లూజెట్ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడం కోసం అతి తక్కువ కాలంలోనే రాంబిల్లి ఇండస్ట్రియల్ పార్కులో 102 ఎకరాలకు పైగా భూమిని కేటాయించాం. అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ త్వరితగతిన అందించాం' అని లోకేశ్ తెలిపారు.

* **పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా ఉత్తరాంధ్ర**

'ఉత్తరాంధ్రను ఎకనమిక్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. గూగుల్ డేటా సెంటర్, ఆర్సెలార్ మిత్తల్ స్టీల్‌ప్లాంట్, టీసీఎస్, కాగ్నిజెంట్ ఐటీ పెట్టుబడులతో ఉత్తరాంధ్ర పెట్టుబడుల ప్రధాన గమ్యస్థానంగా మారుతోంది. విశాఖ ఎకనమిక్ రీజియన్‌ను ఫార్మాస్యూటికల్స్, మెడికల్ ఉపకరణాలు, పెట్రోకెమికల్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నాం. ఈ ప్రాంతాన్ని ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం. విశాఖ పోర్టు ద్వారా కనెక్టివిటీ, విస్తారమైన భూమి లభ్యత, నైపుణ్యం కలిగిన మానవవనరులు ఉత్తరాంధ్ర ప్రాంతానికి బలం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, అనకాపల్లి ఎంపీ సి.ఎం.రమేశ్, ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, బ్లూజెట్ హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ అక్షయ్ అరోరా, మేనేజింగ్ డైరెక్టర్ శివెన్ అరోరా, వైస్ ప్రెసిడెంట్ వేణుబాబు, సహ వ్యవస్థాపకులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నరేష్ షా తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా మొదలైన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

జైపుర్: దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా హ్యూమన్ ప్యాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ)ని ఇది అరికడుతుంది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు సింగిల్ డోస్ 'గార్డాసిల్ 4' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది.

* **'కాంగ్రెస్ ఇప్పుడు 'ముస్లింలీగ్-మావోయిస్టు కాంగ్రెస్'గా మారింది'**

అజ్‌మేర్‌లో కాంగ్రెస్‌పై మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ (ఐఎన్‌సీ) ఇప్పుడు ముస్లిం లీగ్ మావోయిస్టు కాంగ్రెస్‌గా మారిందని విమర్శించారు. ముస్లిం లీగ్‌కు భారత్‌పై ఉన్న ద్వేషమే నాడు విభజనకు కారణమైందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ యువజన విభాగం చేసిన అర్ధనగ్న నిరసనపై మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కించపరచడానికి దొరికిన ఏ అవకాశాన్నీ కాంగ్రెస్ వదులుకోదని మండిపడ్డారు. ప్రపంచం భారత్‌ని ప్రశంసించినప్పుడు, భారతీయులంతా గర్వపడితే..కాంగ్రెస్ మాత్రం దేశాన్ని కించపరిచే ప్రయత్నాలు చేస్తుంటుందన్నారు.

# ఖమేనీ చనిపోయినట్లే!

జెరూసలెం: వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు ఖమేనీ నివాస ప్రాంగణం నేలమట్టమైనట్లు ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు పేర్కొన్నారు. ''ఇప్పటివరకూ అందిన సంకేతాల ప్రకారం ఆ నిరంకుశుడు జీవించి ఉండకపోవచ్చు'' అని ఆయన తెలిపారు. ఖమేనీ ప్రాంగణంపై శనివారం ఉదయం 30 బాంబులను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. అయితే ఖమేనీ సురక్షితంగానే ఉన్నారని, తమకు తగిన మార్గనిర్దేశం చేస్తున్నారని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ దళం స్పష్టంచేయడం గమనార్హం.

**ట్రూత్‌లో పోస్ట్ చేసిన ట్రంప్**

ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి చెందినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఈమేరకు సామాజిక మాధ్యమం ట్రూత్‌లో పోస్ట్ చేశారు. ఇరానియన్లు దేశాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి ఇదో గొప్ప అవకాశమన్నారు. ఇరాన్‌పై నిరంతరాయంగా భారీ బాంబు దాడులు కొనసాగుతాయి, ఈ దాడులు వారం, అంతకంటే ఎక్కువ రోజులు కొనసాగవచ్చని పేర్కొన్నారు.

# శారదా పీఠం భూములపై హైడ్రామా

నార్సింగి : హైదరాబాద్ కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూములపై సోమవారం హైడ్రామా నడిచింది. ఉదయం ఆ భూములను ప్రభుత్వం తమకు కేటాయించిందని జలమండలి ప్రకటన విడుదల చేసింది. స్వాధీనానికి అధికారులు వెళ్లారు. అనంతరం అక్కడికి భారాస నేత హరీశ్‌రావు చేరుకొని..కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడానికి గుళ్లూ, మఠాలను ధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. విషయం తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాయంత్రం సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో అక్కడ ఉన్న నిర్మాణాల స్థితిని ఎందుకు చెప్పలేదని అధికారులపై మండిపడ్డారు. జలమండలికి కేటాయింపులు రద్దు చేసి ఆ భూములను శారదా పీఠానికే కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని పీఠం ప్రతినిధులకు ముఖ్యమంత్రి సూచించారు. ఈ నిర్ణయాన్ని హరీశ్‌రావు స్వాగతించారు. రాజశ్యామల అమ్మవారి కృపతో జరిగిన ధర్మ విజయమని అభివర్ణించారు.

* **నియోపోలిస్‌లో జలమండలికి 3.95 ఎకరాలు**

అంతకు ముందు ఉదయం కోకాపేటలోని నియోపొలిస్ ప్రాంతంలో 3.95 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించినట్లు జలమండలి ఓ ప్రకటనలో చెప్పింది. మూసీ పునరుజ్జీవానికి ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను గోదావరి జలాలతో నింపడానికి.. అదనంగా 300 ఎంజీడీ నీటిని తరలించడానికి అక్కడ ప్రాజెక్టులు చేపట్టినట్లు తెలిపింది. 'నియోపోలిస్, పరిసర ప్రాంతాల్లో భారీ భవంతులు, గేటెడ్ కమ్యూనిటీలు వృద్ధి చెంది తాగునీటి అవసరం పెరిగినందున.. ఖానాపూర్‌లోని 8.75 ఎకరాలకు అదనంగా మరికొంత కేటాయించాలని ప్రభుత్వాన్ని జలమండలి అభ్యర్థించింది. దీంతో 3.95 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఫిబ్రవరి 23న జరిగిన మంత్రిమండలి సమావేశంలోనే భవిష్యత్తు అవసరాలకు కోకాపేట పరిసర ప్రాంతాల్లోని భూములను కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో శారదా పీఠానికి చెందిన రెండు ఎకరాలున్నాయి. వాటిని స్వాధీనం చేసుకొని శంషాబాద్‌లో ప్రత్యామ్నాయ భూమి ఇస్తామని నాడు ప్రభుత్వం చెప్పింది.

# పాక్ నేతలు గ్రేట్ : ట్రంప్ ప్రశంసలు

వాషింగ్టన్ : పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలో తలదూర్చేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిరాకరించారు. పాకిస్తాన్‌తో తనకు బలమైన సంబంధాలు ఉన్నాయని, ఆ దేశం పనితీరు చాలా బాగుంద ని వ్యాఖ్యానించారు. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌పై ఆయన ప్రశంసలు కురిపించారు. 'నేను పాకిస్తాన్‌తోనే ఉన్నాను. వారికి ఓ గొప్ప ప్రధాని, ఓ గొప్ప సైనాధ్యక్షుడు ఉన్నారు' అని విలేకరులతో అన్నారు. వారిద్దరినీ తాను ఎంతగానో గౌరవిస్తానని చెప్పుకొచ్చారు. కాగా పాకిస్తాన్ నేతలపై ట్రంప్ ప్రశంసలు కురిపించడం ఇది మొదటిసారి కాదు. పాక్ ప్రధాని, సైన్యాధ్యక్షుడు గొప్పవారని, అపురూపమైన వ్యక్తులని గతంలో అన్నారు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య గత కొద్ది రోజులుగా ఉద్రిక్తతలు పెరుగుతున్న విషయం తెలిసిందే. ఇరు పక్షాలకూ చెందిన సైనికులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. ఫిబ్రవరి 26న సరిహద్దుల వెంబడి కాల్పులు జరగడంతో ఘర్షణలు చెలరేగాయి.

# సోలార్ బెంబేలు

న్యూఢిల్లీ : విచారణకు సహకరించేందుకు అదానీ గ్రూప్ కంపెనీలు నిరాకరించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత సౌర దిగుమతులపై భారీగా సుంకాలు విధించిన విషయం తెలిసిందే. ఈ పరిణామం భారతీయ సౌర ఉత్పత్తిదారులకు అశనిపాతంగా మారింది. అమెరికాకు సోలార్ మాడ్యూల్స్‌ను ఎగుమతి చేయడం ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో ఇప్పుడు ఉత్పత్తిదారులు యూరప్, ఆఫ్రికా వంటి ప్రత్యామ్నాయ మార్కెట్లపై దృష్టి సారిస్తున్నారు. భారత సౌర ఉత్పత్తి సామర్థ్యం 2020 నుంచి ఏకంగా 13 రెట్లు పెరిగింది. దీనికి ప్రధాన కారణం నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ). 2030 నాటికి ఐదు వందల గిగాబైట్ల పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు మన దేశం చైనా నుంచి సౌర దిగుమతులను తగ్గించుకోవాలని భావిస్తోంది. ఇందుకోసం దేశీయంగా ఉత్పత్తిని ప్రోత్సహించడానికి పీఎల్ఐని ముందుకు తెచ్చింది.

**పెరిగిన సరఫరాలతో ఎగుమతులపై దృష్టి**

దేశంలో సౌర ఉత్పత్తిని పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరినప్పటికీ, తయారీదారులకు రెండు సమస్యలను సృష్టించింది. స్థానిక డిమాండును మించి సరఫరాలు పెరిగాయి. ఫలితంగా తయారీదారులు ఎగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. కీలక అమెరికా మార్కెట్‌కు జరుగుతున్న ఎగుమతులపై తీవ్రమైన టారిఫ్ భారం పడుతోంది. భారత ప్రభుత్వం తన ఉత్పత్తిదారులకు సబ్సిడీలతో కూడిన ప్రోత్సాహకాలు అందిస్తున్న విషయాన్ని గుర్తించిన ట్రంప్ ప్రభుత్వం తాజాగా మన దేశం నుంచి జరుగుతున్న సౌర దిగుమతులపై ఏకంగా 126 శాతం సుంకాన్ని విధించారు. ఇండొనేషియా, లావోస్ దేశాల నుంచి కూడా సౌర దిగుమతులు జరుగుతున్నప్పటికీ వాటిపై ఈ స్థాయిలో సుంకాన్ని విధించడం లేదు. గత సంవత్సరం తొలి ప్రథమార్ధంలో అమెరికాకు జరిగిన సోలార్ మాడ్యూల్స్ ఎగుమతుల్లో ఈ మూడు దేశాల వాటా 57 శాతంగా ఉందని బ్లూమ్‌బర్గ్ న్యూ ఎనర్జీ ఫైనాన్స్ (బీఎన్ఈఎఫ్) తెలిపింది.

## రాధికా హైస్కూల్‌లో ఘనంగా "ఎడ్యుఫెయిర్–2026" వైజ్ఞానిక ప్రదర్శన



ప్రజాస్ఫూర్తి, కాప్రా: కాప్రాలోని స్థానిక రాధికా హైస్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన "ఎడ్యుఫెయిర్-2026" కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు.కార్యక్రమాన్ని కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్.ఐ. నిర్మాల వెంకన్నలు విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా శక్తిని వెలికి తీయడంలో ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయుక్తమని పేర్కొన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలంటే ఇలాంటి వేదికలు అవసరమని తెలిపారు. విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ ప్రాజెక్టులు, మోడల్స్, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, శక్తి వనరుల సంరక్షణకు సంబంధించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, సలహాదారు శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### పదవీ విరమణ పొందిన ఎస్బి ఎస్సై సూర్యనారాయణను
## ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ శనివారంతో పదవీ విరమణ పొందిన సూర్యనారాయణ ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు.స్పెషల్ బ్రాంచ్ నందు ఎస్సైగా పనిచేస్తూ పదవీ విరమణ పొందారు.37 సంవత్సరాల పాటు పోలీస్ శాఖలో సేవలందించిన సూర్యనారాయణ సేవలు ప్రశంసనీయం అని అన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన అధికారులు , సిబ్బంది తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని అన్నారు.గత 37 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తూ తాము సాధించిన అనుభవాన్ని పదవీ విరమణ పొందిన సూర్యనారాయణ ఎస్పీకి వివరించి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డీఎస్పీ మల్లయ్య స్వామి,ఏఓ మంజ్యా నాయక్,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు , పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

### కుషాయిగూడలో శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో
## ఆర్చిగేటు నిర్మాణానికి శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి, కాప్రా : శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఈశాన్య భాగంలో ఆర్చిగేటు నిర్మాణానికి శంకుస్థాపన పూజా కార్యక్రమం శ్రద్ధాభక్తులతో నిర్వహించబడింది. దాత , ఆలయ ఫౌండర్ ట్రస్టీ ఉప్పల యాదగిరి రెడ్డి వారి కుమారుడు స్వర్గీయ ఉప్పల శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థం ఈ ఆర్చిగేటును నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, వేదమంత్రోచ్ఛారణల మధ్య శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి మఠం వీరేశం, ఫౌండర్లు పల్లె సురేందర్ రెడ్డి, పల్లె నరేందర్ రెడ్డి, పల్లె శ్రీకాంత్ రెడ్డి, పల్లె భద్రారెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక భక్తులు బసంత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి మరియు దేవస్థాన అర్చక సిబ్బంది హాజరయ్యారు. దేవస్థాన అభివృద్ధిలో భాగంగా నిర్మించబడుతున్న ఈ ఆర్చిగేటు ఆలయ శోభను మరింత పెంపొందించనుందని నిర్వాహకులు తెలిపారు.

## అలరించిన సైన్స్ ఫేర్

* **వివేకానంద పాఠశాలలో కనబరచిన విద్యార్థుల ప్రతిభ**



జిన్నారం, ప్రజాస్ఫూర్తి:జిన్నారం లోని వివేకానంద పాఠశాలలో "శాస్త్రం, ఆవిష్కరణలలో ప్రపంచ నాయకత్వానికి యువతను శక్తివంతం చేయడం" అనే థీమ్‌తో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాం డెంట్ కరుణ సాగర్ రెడ్డి, ప్రిన్సి పాల్ రాయన్న, విద్యార్థుల్లో జిజ్ఞాసా స్వభావం, శాస్త్రీయ దృక్పథం,ఆవిష్కరణాత్మక ఆలోచనలను అభివృద్ధి చేయాలని సూచించారు.విద్యార్థులు వివిధ శాస్త్ర ప్రదర్శనలు, నమూనాలను ప్రదర్శించి, తమ శాస్త్రీయ జ్ఞానాన్ని అందరితో పంచుకున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


# వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో మేదస్సు పెంపొందుతుంది

* **ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే.రామేశ్వర్ రెడ్డి**






జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో మేదస్సు పెంపొందుతుందని ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కే.రామేశ్వర్ రెడ్డి అన్నారు. జాతీయ వైజ్ఞానిక దినోత్సవం పురస్కరించుకొని జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి సంజయ్ పురి కాలనీలో గల వైష్ణవి టెక్నో స్కూల్స్ లో శనివారం ఏర్పాటు చేసిన "వైష్ణవి ఇగ్నైట్ సైన్స్ ఫెస్ట్ 2026" వేడుకలను టీయూడబ్ల్యూజే ఐజేయు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు గౌడ్,వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ చెప్యాల నరసింహులు గౌడ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలను తిలకించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రయోగాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, తమ లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు తీసుకెళ్లడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు సాంకేతిక రంగాల్లో ముందుకు రావాలంటే ఇలాంటి వేదికలు అవసరమని తెలిపారు. పాఠశాల చైర్మన్,ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు చెప్యాల నరసింహులు గౌడ్ మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యార్థుల మనోభావాలకు అనుగుణంగా బోధిస్తున్నామన్నారు.నర్సరీ నుండి పదవ తరగతి విద్యార్థులు సుమారు 300 కు పైగా నమూనాలను తయారు చేసి ప్రదర్శించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శిల్ప, ఉపాధ్యాయ బృందం లక్ష్మీ, సృజన, భవాని, ఝాన్సిరాణి, శ్రీలత, పావని, పద్మిని, సౌజన్య, సరస్వతి,పర్వీన్ సుల్తానా, ప్రవీణా, భవాని, పాణిగ్రహి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు





### అందరికీ ఆరోగ్య రక్ష,
## ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్

* **జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్**



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రవి రాథోడ్ ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ ప్లాన్ గురించి జిల్లాలో ఉన్న రాష్ట్రీయ బాల స్వస్థ (ఆర్.బి.ఎస్.కె) కార్యక్రమం వైద్యాధికారులకు, డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ , సిబ్బంది అందరికీ ఆరోగ్య తెలంగాణ 100 రోజుల యాక్షన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ మార్చి 4 నుండి కార్యక్రమం ప్రారంభమవునని 6 సంవత్సరాల 18 సంవత్సరాల పిల్లలందరికీ, ప్రభుత్వ రెసిడెన్సి స్కూల్, పిల్లలను స్క్రీనింగ్ చేయడం, ముఖ్యంగా స్కూల్ పిల్లలో న్యూట్రిషన్ డెఫిషియన్సి గుర్తించడము, రక్తహీనత ఉన్న పిల్లలను గుర్తించడము, వ్యక్తిగత పరిశుభ్రతను, అవగాహన కల్పించడం, మానసిక రుగ్మతలను గుర్తించడము, ఒత్తిడి నివారణకు యోగా కౌన్సిలింగ్ లాంటివి నిర్వహించడము జరుగునని అన్నారు.ఈ శిబిరంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీనారాయణ,డాక్టర్ విజయ్ కుమార్,డాక్టర్ ప్రత్యూష, కె.వి. రాజు హెల్త్ ఎడ్యుకేటర్, హెచ్ ఈ ఓ స్వామి, అనిల్, కవిత, ఆర్ బి ఎస్ కే టీమ్స్, డి ఈ ఐ సి సిబ్బంది పాల్గొన్నారు.

## ఈసీఐఎల్ బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శన




ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఈసీఐఎల్ ప్రాంతంలోని బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్‌లో వైజ్ఞానిక ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ పద్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాల శాస్త్రీయ ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు నిర్వహించిన వైజ్ఞానిక ప్రయోగాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సైన్స్, పర్యావరణం, సాంకేతికత తదితర అంశాలపై రూపొందించిన నమూనాలు విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పద్మశ్రీ మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడలు , వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, తమ లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు తీసుకెళ్లడం ఉపాధ్యాయుల బాధ్యత అని తెలిపారు. రానున్న రోజుల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నామని ఆమె వెల్లడించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తల్లిదండ్రులు ఆసక్తిగా వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

## అక్షరాలు జీవిత రథచక్రాలు

* **56వ డివిజన్ కార్పొరేటర్ శాంతి ప్రియ**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : నేర్చుకునే అక్షరాలు జీవిత రథ చక్రాలు అని 56వ డివిజన్ కార్పొరేటర్ శాంతిప్రియ అన్నారు. జిఆర్ బస్తీ 2 అంగన్ వాడీ కేంద్రంలో శనివారం పిల్లలకు అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన శాంతిప్రియ పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్న పిల్లలకు చదువులు నేర్పించే క్రమంలో అంగన్ వాడీ టీచర్లు ఓపికతో ముందుకు సాగాలని, వారికి అంగన్ వాడీ కేంద్రాల వద్ద చక్కటి వాతావరణాన్ని అందించాలని, పౌష్టికాహారం మెనూ ప్రకారం ఇవ్వాలని అన్నారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి వారి ఆటపాటలు చూసి మురిసిపోయారు. ప్రతీ నెలా నాల్గవ శనివారం అంగన్ వాడీ కేంద్రంలో క్రమం తప్పకుండా ఇసిసి ప్రోగ్రాం నిర్వహించడం అభినందనీయం అని, ఈ కార్యక్రమంలో పిల్లల తల్లులను కూడా భాగస్వామ్యం చేయడం బాగుందన్నారు. నెల రోజుల పాటు అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులు నేర్చుకున్న అంశాలను వారితోనే చెప్పించి పిల్లల్లో సృజనాత్మక శక్తిని పెంచేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కార్పొరేటర్ శాంతిప్రియ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాబోయే రోజుల్లో మరింత వినూత్నంగా చేసేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శారద, సెంటర్ టీచర్ జుబేదా బేగంతో పాటు అంగన్వాడీ టీచర్లు గౌసియా బౌగం, రాజమణి, సూజత, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం




మల్కాజిగిరి . ప్రజాస్ఫూర్తి : మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పాల్గొన్నారు మైనంపల్లి హనుమంతరావు తరచుగా నియోజకవర్గంలోని ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటరు మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు పేర్కొంనరు. ఇలాంటి కళ్యాణ మహోత్సవాలు భక్తిభావాన్ని, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు . రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అమ్మవారి ఆశీస్సులతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానని హామీ ఇచ్చారు మల్కాజిగిరి అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు

## బీసీలకు బడ్జెట్‌లో
### రూ.60 వేల కోట్లు కేటాయించాలి

* **జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 60 వేల కోట్లు కేటాయించి, బీసీ సబ్ ప్లాన్ను తక్షణమే అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ముస్తాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. కామారెడ్డి సభలో ప్రకటించినట్లుగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఏడాదికి రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్లు కేటాయిస్తామని చెప్పి, ఇప్పుడు అంకెలకే పరిమితం చేస్తున్నారని మండిపడ్డారు. గత బడ్జెట్లలో కేటాయించిన నిధులను కూడా పూర్తిస్థాయిలో ఖర్చు చేయడం లేదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీల పట్ల చిత్తశుద్ధితో ఉంటే.. బీసీ స్టడీ సర్కిల్స్, కొత్త గురుకులాలు, ప్రత్యేక పాఠశాలలు, కులవృత్తుల కార్పొరేషన్లు మరియు పథకాలను బలోపేతం చేయాలని కోరారు. అలాగే పల్లెలు, పట్టణాల్లో బీసీ ఐక్యత భవనాలు నిర్మించి, నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపాలని, లేనిపక్షంలో బీసీలందరినీ ఏకం చేసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు జాల బిక్షపతి, పుల్లూరి రవి, బద్ద వెంకటి, మోతే నర్సింలు, బద్ద నాంపెల్లి, నీరటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టైలర్స్ డే వేడుకలు




ప్రజాస్ఫూర్తి, కాప్రా: ఉప్పల్ నియోజకవర్గ మేరు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఎస్‌బి కాలనీలో టైలర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సభ్యులు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు సింగు విష్ణు మాట్లాడుతూ, ప్రభుత్వం అందజేసే కుట్టు మిషన్లను అర్హులైన మేరు వృత్తిదారులకు అందజేయాలని కోరారు. అదేవిధంగా పాఠశాల యూనిఫార్ముల కుట్టు ఆర్డర్లను కూడా స్థానిక కుట్టుదారులకు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇలా చేస్తే సంప్రదాయ వృత్తులు అభివృద్ధి చెందడంతో పాటు వృత్తిదారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు కే. శ్రీనివాస్, రుద్రంగి కరుణాకర్, రాపర్తి సాయినాథ్, కర్నే మల్లేష్, మాడిశెట్టి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాద భీమా కేసులను
## అధిక సంఖ్యలో పరిష్కరించాలి

* **జిల్లా జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ**




మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి, మార్చి 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ లో రోడ్డు ప్రమాద బీమా కేసులను అధిక సంఖ్యలో పరిష్కరించాలని మహబూబాబాద్ జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ సన్నాహక చర్యల్లో భాగంగా న్యాయమూర్తి శనివారం బీమా కంపెనీ న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులకు భీమా అనేది సంక్షేమ చట్టంలో భాగమని, బీమా కంపెనీలు లోక్ అదాలత్ బాదితులకు సత్వర పరిష్కారం అందించటం లో సహకరించాలన్నారు. బాధితుల తరపు న్యాయవాదులు రాజీకి ముందుకు వచ్చినట్లయితే తాము పరిశీలిస్తామని భీమా కంపెనీ న్యాయవాదులు న్యాయమూర్తి దృష్టికి తీసుకొని వచ్చారు. దీంతో బాధితులకు సత్వర పరిహారం అందించే విధంగా బాధితుల తరపు న్యాయవాదులు లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని న్యాయమూర్తి కోరారు. లోక్ అదాలత్ రాజీ వల్ల భీమా కంపెనీలకు వడ్డీ తగ్గింపుతో పాటు కక్షిదారులకు సత్వర పరిహారం అందుతుందని ఉభయ పక్షాలకు ప్రయోజనం చేకూర్చే జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకోవాలని న్యాయమూర్తి సూచించారు.

# ఉత్సాహంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలు



ప్రజాస్ఫూర్తి , జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండల పరిధిలోని పొనకల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం రోజున ఘనంగా జాతీయ వైజ్ఞానిక దినోత్సవ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా తయారు చేసి, ప్రదర్శించిన వివిధ రకాలైన సైన్సు ప్రాజెక్టులు, మోడల్లు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాన్ని పొనకల్ గ్రామపంచాయతీ సర్పంచ్ జక్కు సుష్మభూమేష్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులను వారు స్వయంగా పరిశీలించి, చిన్నారులతో ముచ్చటించారు. చక్కటి సైన్స్ ఫెయిర్ ఏర్పాటుచేసిన విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల చైర్ పర్సన్ మూల రేణుక, ఉపాధ్యాయులు కే రాజేశం, కే శ్రీకాంత్, బి వనిత, కే సుజాత, సమ్రీన్ , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో పోలీస్ అధికారుల పదవీ విరమణ



సైబరాబాద్, ప్రజాస్ఫూర్తి : విధి నిర్వహణలో పోలీసులు చేసే త్యాగాల వెనుక వారి కుటుంబ సభ్యుల పాత్ర వెలకట్టలేనిదని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన నలుగురు పోలీసు సిబ్బందిని ఘనంగా సన్మానించారు. సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ రిటైర్ అయిన సిబ్బందికి పెన్షన్ పత్రాలను అందజేసి పూలమాలలతో శాలువాలతో సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈరోజు పదవీ విరమణ చేసిన వారిలో.. చందానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ గణపురం శ్యామ్ ప్రసాద్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ కె. నాగేశ్వర్ రెడ్డి, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎఎస్ఐ కొండా సత్యనారాయణ గౌడ్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ చిర్రా సత్యనారాయణ ఉన్నారు. పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు, సహచరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, అడ్మిన్ ఏడీసీపీ ఎఫ్. రెహ్మాన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీపీఓ అకౌంట్స్ వెంకట్ రెడ్డి, ఏఓ అడ్మిన్ జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్‌బి హిమకర్, సైబరాబాద్ పోలీస్ సహకార సంఘం ఇన్ చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# హేతుబద్ధీకరణ జీవో 25ను వెంటనే సవరించాలి

*** బీసీటీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ గౌడ్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హేతుబద్ధీకరణ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం సరికాదని బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ (బీసీటీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్ అన్నారు. శనివారం సిరిసిల్లలో ఆయన మాట్లాడుతూ.. హేతుబద్ధీకరణ జీవో నెంబర్ 25ను సవరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణలో 20 నుండి 60 మంది విద్యార్థులు ఉన్న ప్రాథమిక పాఠశాలలు అధికంగా ఉన్నాయని, 40 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను, 60 మంది ఉంటే ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించేలా నిబంధనలు మార్చాలని కోరారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టుతో పాటు, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. విద్యను సామాన్యులకు అందని ద్రాక్షగా మార్చవద్దని ఆయన హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వికృతి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, జిల్లా అధ్యక్షులు పులి రాంగోపాల్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐటికాల సుధాకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాటికొండ కృష్ణహరి, నాయకులు వనపర్తి మల్లేశం, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రెయిన్బో పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న వైజ్ఞానిక నైపుణ్యాలను వెలికి తీసే ఆస్కారం ఉందని పాపిరెడ్డి నగర్ బస్తి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి అన్నారు. బస్తీ లోని రెయిన్బో హై స్కూల్ లో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి చంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రదర్శనను తిలకించిన చంద్రారెడ్డి మాట్లాడుతూ సైన్సె ఫెయిర్ లో విద్యార్థులు చేపట్టిన వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు అభినందనీయమన్నారు. చదువుతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణిస్తూ తల్లిదండ్రులకు, గురువులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావడంతో పాటుగా దేశానికి ఉపయోగపడేలా తయారు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు వెంకటేష్, వనం ఆంజనేయులు, కనకా రెడ్డి, శంకర్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులతో పాటుగా విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా వాసవి, వనిత క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి, షాద్నగర్ : షాద్ నగర్ పట్టణంలో స్థానిక సాయిరాజా ఫంక్షన్ హాల్‌లో శనివారం వాసవి క్లబ్ షాద్‌నగర్, వనిత క్లబ్ షాద్‌నగర్ 2026 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. క్లబ్ గవర్నర్ అల్లాది పరమేశ్వర్ ఆధ్వర్యంలో నూతన బాధ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వాసవి క్లబ్ షాద్‌నగర్ అధ్యక్షులుగా గుంత సత్యనారాయణ, కార్యదర్శిగా గజవాడ యశ్వంత్, కోశాధికారిగా సోమ శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. వనిత క్లబ్ షాద్‌నగర్ అధ్యక్షురాలిగా బ్రుగుమల్ల చంద్రిక, కార్యదర్శిగా గజ్జల మహేశ్వరి, కోశాధికారిగా సిరిపురం శ్రీదేవి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మిట్టదూరయ్య మాట్లాడుతూ.. షాద్‌నగర్ వాసవి, వనిత క్లబ్‌లు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు. అంతర్జాతీయ స్థాయిలో ఏటా వందలాది కోట్ల రూపాయల విలువైన సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, వాసవి క్లబ్ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం కూడా సత్కరించిందని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ దొంతు పాండురంగయ్య, అడిషనల్ ట్రెజరర్ నరసింహ గుప్తా, క్యాబినెట్ సెక్రటరీ ఉప్పల శ్రీనివాస్, నీల విజయలక్ష్మి, ట్రెజరర్ నర్సింలు, వాడకట్టు విజయకుమార్, గుడిపల్లి వెంకటరమణ, మాణిక్యం మరియు ఆర్యవైశ్య అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మేయర్ కు ఘన సన్మానం



నల్గొండ, ప్రజాస్ఫూర్తి : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో జర్నలిస్టులకు జిల్లా స్థలాలు ఇప్పించేందుకు చొరవ తీసుకుంటానని నల్గొండ కార్పొరేషన్ తొలి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ముందుంటానని ఆమె హామీ ఇచ్చారు. నల్గొండ నగర తొలి మేయర్ గా బాధ్యతలు స్వీకరించిన బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులను శనివారం నల్గొండ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో అభినందించి సత్కరించారు. ప్రెస్ క్లబ్ మెమెంటో ను అందజేశారు. ఈ సందర్భంగా నల్గొండ పట్టణం లో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఏళ్ల తరబడి జిల్లా కేంద్రం లో పని చేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. నగర తొలి మేయర్ గా రికార్డు సృష్టించిన చైతన్య శ్రీనివాస్ రెడ్డికి నగర అభివృద్ధి విషయం లో సంపూర్ణ సహకారం అందిస్తామని జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎర్రెడ్ల చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగాల శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, ఉపాధ్యక్షులు యాదయ్య, మదనాచారి, కార్యదర్శులు వరకాంతం కిరణ్ రెడ్డి, లింగయ్య, సహాయ కార్యదర్శులు మహమ్మద్ సయ్యద్, నత్తి ఉపేందర్, ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సోమచంద్రశేఖర్, అశోక్ కుమార్, భాస్కర్, వెంకన్న, రవి, కృష్ణ, దశరథ , కారింగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామనవమి ఉత్సవాలకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలి

*** జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: మార్చి 27, 28 తేదీలలో జరగనున్న శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం, మహా పట్టాభిషేక ఉత్సవాలకు సంబంధించి అన్ని శాఖల అధికారులు ముందస్తుగా అప్రమత్తమై, పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను సిద్ధం చేయాలని శనివారం సంబంధిత అధికారులతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఆయన దిశానిర్దేశం చేశారు. రేపు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భద్రాచలంలో పర్యటించి ఏర్పాట్లపై సమీక్షించనున్న నేపథ్యంలో, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపై భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్టకు పలు సూచనలు చేశారు.ముఖ్యంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాలు, క్యూలైన్లు మరియు కళ్యాణ వేదిక వద్ద పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు తాగునీటి కుళాయిలు, వాటర్ ప్యాకెట్ల సేకరణ వంటి పనులను ముందస్తుగానే పూర్తి చేయాలని, ఆలయ ఈవో దామోదర్ రావు పర్యవేక్షణలో విద్యుదీకరణ, ఆలయ సుందరీ కరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. భక్తుల ఆరోగ్య భద్రత కోసం వైద్య ఆరోగ్య శాఖ క్యూలైన్ల వద్ద వైద్య శిబిరాలను, అవసరమైన మందులు మరియు సిబ్బందిని సిద్ధం చేసుకోవాలని, ఏరియా ఆసుపత్రిలో అత్యవసర విభాగాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అగ్నిమాపక శాఖ వారు అవసరమైన ఫైర్ సేఫ్టీ పరికరాలతో సిద్ధంగా ఉండాలని, పోలీస్ మరియు ట్రాఫిక్ విభాగాలు సమన్వయం చేసుకొని వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక సెక్టార్లను ఇప్పుడే ఖరారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల వసతి కోసం ఆన్‌లైన్ బుకింగ్, టికెట్ విక్రయాల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని, ఉత్సవ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని తెలిపారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఎక్కడా ఎటువంటి లోటుపాట్లకు తావు లేకుండా భక్తులకు భక్తి పరిపూర్ణమైన అనుభూతిని అందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



# పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పీఎం విశ్వకర్మ పథకాన్ని వృత్తిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి సూచించారు. శనివారం రుద్రంపూర్ సీఈఆర్ క్లబ్‌లో పీఎం విశ్వకర్మపథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం విశ్వకర్మ, పీఎం ఈజీపీ పథకాలు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు, నిరుద్యోగులకు, చేతివృత్తులు చేసుకునే వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ పథకాలకు దరఖాస్తు చేసే విధానం, అందించే సబ్సిడీ శాతం, అర్హత ప్రమాణాలు, అలాగే ఏ ఏ రంగాలకు చెందిన వారు అర్హులనే అంశాలపై సమగ్రంగా వివరించారు.అనంతరం ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలపై సమగ్ర వివరాలు వెల్లడించారు. రుణం పొందేందుకు అవసరమైన అర్హతలు, దరఖాస్తు విధానం, లబ్ధిదారులు పాటించాల్సిన నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఐపీపీబీ ఖాతాలను ప్రారంభించి, ఆన్‌లైన్ మర్చంట్ స్టికర్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫెసిలిటేషన్ ఆఫీసర్ (ఎంఎస్ఎంఈ) దినేష్ కుమార్, ర్యాంప్ ఈడీసీ మేనేజర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావు నగర్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్లో

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



ప్రజాస్ఫూర్తి, కాప్రా: విద్యార్థుల్లో సామాజిక సమగ్ర అవగాహన పెంపొందించి సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని కుషాయిగూడ సిఐ భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వివిధ శాస్త్రీయ నమూనాలు, సృజనాత్మక ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చేసిన వివరణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా సిఐ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సైన్స్ ఎక్స్‌పో నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వి. శేషుకుమారి మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు సైన్స్, మ్యాథ్స్ ఎక్స్‌పో, శారీరక మరియు మానసిక వికాసానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకన్న, వైస్ ప్రిన్సిపల్ గీత, ప్రైమరీ ఇన్‌చార్జ్ శ్రీలత, ఉపాధ్యాయులు రాధిక, రాజేందర్, పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఆడబిడ్డల రక్షణకై సైకిల్ యాత్ర

*** సిరిసిల్ల చేరుకున్న బ్లూ క్రాస్ మేనేజర్ శ్రీనివాస్**



ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : ఆడబిడ్డను కాపాడుకుందాం మహిళలపై హింసను అరికడదాం అనే నినాదంతో కామారెడ్డి నుండి వరంగల్ వరకు సామాజిక అవగాహన సైకిల్ యాత్ర చేపట్టిన 'బ్లూ క్రాస్ ' మేనేజర్ శ్రీనివాస్‌కు సిరిసిల్లలో ఘన స్వాగతం లభించింది. యాత్రలో భాగంగా శనివారం ఆయన సిరిసిల్లకు చేరుకోగా, స్వేరో జిల్లా అధ్యక్షులు బట్టు శ్రీకాంత్ ఆయనను కలిసి అల్పాహారం ఏర్పాటు చేసి సాదరంగా పంపించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల రక్షణ కోసం శ్రీనివాస్ చేస్తున్న ఈ కృషి అభినందనీయమని, ఆయన యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు పాల్గొని శ్రీనివాస్ పోరాట స్ఫూర్తిని కొనియాడారు.

# గల్ఫ్ మృతుల కుటుంబాల దీనస్థితిపై ఢిల్లీ జర్నలిస్ట్ అధ్యయనం



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: గల్ఫ్ దేశాలకు ఉపాధి కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాల పరిస్థితులను జాతీయ స్థాయిలో వెలుగులోకి తెచ్చేందుకు ఢిల్లీకి చెందిన ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ పూనమ్ అగర్వాల్ శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో పర్యటించారు. ముస్తాబాద్ మండలం గూడెం, పోతుగల్ గ్రామాలను సందర్శించిన ఆమె, గల్ఫ్ బాధితుల సవాళ్లను స్వయంగా ఆరా తీశారు. 2022లో దుబాయ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందిన దొంతు నరసయ్య నివాసానికి వెళ్లిన పూనమ్ అగర్వాల్.. బీమా, ఆర్గాన్ డొనేషన్ పరిహారం ఇప్పించే విషయంపై చర్చించారు. నరసయ్య భార్య పుష్పలత, కూతుళ్లు శృతి, నితుషాలను పరామర్శించి, మృతదేహం స్వదేశానికి రావడానికి పట్టిన సమయం, ప్రభుత్వం నుండి అందిన సాయంపై వివరాలు సేకరించారు. గల్ఫ్ దేశాల్లో భారతీయులు మరణించినప్పుడు ఎదురయ్యే ఇబ్బందులపై సమగ్ర అధ్యయనం చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఎన్నారై అడ్వైజర్ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల, ఎన్ఆర్ఐ సెల్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తోట ధర్మేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జల రాజు, గుండెల్లి శ్రీనివాస్, ఎల్లయ్య, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాఘవేంద్ర పాఠశాలలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవం

*** ఆకట్టుకున్న 400 సైన్స్ ప్రాజెక్టులు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని రాఘవేంద్ర ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవ (నేషనల్ సైన్స్ డే) వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు సంబంధించి సుమారు 400 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించి తమ సృజనాత్మకతను చాటారు. ఈ సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారి (ఎంఈఓ) నిమ్మల రాజిరెడ్డి, ముస్తాబాద్ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఉప సర్పంచ్ విజయ్, వార్డు మెంబర్లు హాజరయ్యారు. అతిథులు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను సందర్శించి, వారి ప్రతిభను, ఉపాధ్యాయుల కృషిని ప్రత్యేకంగా ప్రశంసించారు. విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంచేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నరేష్, ప్రధానోపాధ్యాయురాలు మంజుల, ఉపాధ్యాయురాలు అపర్ణ, ఇతర బోధన సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 4 లక్షల మందికి ఉచితంగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

నారాయణగూడ: మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి విస్తరిస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్రంలో ఏటా కొత్తగా 55 నుంచి 60 వేల క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని తెలిపారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు 'హెచ్‌పీవీ' (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంత్రి శనివారం హైదరాబాద్ కింగ్‌కోఠి జిల్లా ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ''బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ల కార్యక్రమం మూడు నెలల పాటు కొనసాగుతుంది. ఈ వ్యాక్సిన్ తొలి నెల రోజులు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో ఉంటుంది.

# రాజకీయాలకతీతంగా నీలగిరి నగరాభివృద్ధి చేసుకుందాం



*** మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి.**

నల్లగొండ, ప్రజా స్ఫూర్తి : ఎన్నికల అప్పుడే ఎవరి రాజకీయాలు వారివి ఎన్నికలు అయిపోయినందున నల్లగొండ నగరాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందామని నల్లగొండ కార్పొరేషన్ మొదటి మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్ లో జరిగిన మొదటి కార్పొరేషన్ సాధారణ సమావేశంలో ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు.నగరంలోని అన్ని డివిజన్లో సమస్యలకు పరిష్కారం చూపి ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పిద్దామని స్పష్టం చేశారు. కార్పొరేటర్లందరినీ సమావేశంలో పరిచయం చేశారు. కార్పొరేటర్లు తమ తమ డివిజన్లో ఉన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువచ్చారు. పలు డివిజన్లో డ్రైనేజీ రోడ్డు సమస్య ఉందని త్వరగా పనులు పూర్తి అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఆయా డివిజన్లో వారానికి ఒకసారి చెత్త డాక్టర్ ట్రాక్టర్లు వస్తున్నాయని దాంతో చెత్త కుప్పలు పేరుకు పోతున్నాయని మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని పెద్ద డివిజన్లఉన్నందున ఎక్కువ సిబ్బందిని కేటాయించాలని కోరారు.వీధి దీపాలు కొన్ని చోట్ల వెలగడం లేదని కొత్త లైట్లు తెప్పించి వేయాలని మేయర్ ను అభ్యర్థించారు. రాబోయే వేసవికాలంలో నగరంలో నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్పొరేటర్లు అడిగిన అన్ని ప్రశ్నలకు మేయర్ సుదీర్ఘంగా సమాధానం ఇచ్చారు.అనంతరం మేయర్ మాట్లాడుతూ ఆయా డివిజన్లో పనులు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు సిబ్బందితో మాట్లాడి చెత్త సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు.అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసి సమస్యలు రాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వచ్చాక అన్ని పనులు పూర్తి చేయిస్తున్నామని రానున్న రోజుల్లో 24 గంటల పాటు త్రాగునీటిని అందించడం జరుగుతుందన్నారు.డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ మైనార్టీ కార్పొరేషన్లకు ఎజెండాను ఉర్దూలో ప్రింట్ చేసి ఇవ్వాలని కోరారు. అంతకుముందు కార్పొరేటర్లందరూ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డిని దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర కార్పొరేటర్లు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు ఏక మొత్తంలో చెల్లించాలి

*** మార్చి 2న చేపట్టనున్న నిరాహార దీక్ష కు తరలాలి**

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు ఏక మొత్తంలో చెల్లించాలని డిమాండ్ చేస్తూ మార్చి 2న కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి చేపట్టానున్న నిరాహార దీక్షకు మద్దతునిస్తునామని రేవా జిల్లా అధ్యక్షుడు సంకా బద్రి నారాయణ, సంఘం గౌరవాధ్యక్షులు సోమ గోవర్ధన్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో శనివారం ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. నేటికీ 78 మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ దాచుకున్న డబ్బులు రాకపోవడం దారుణమన్నారు. వైద్యం చేసుకోకపోవడం వల్ల తమ ప్రాణాలను వదిలని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద జరిగే నిరాహార దీక్షకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. తమకు రావాల్సిన డబ్బులు అన్నిటిని వచ్చే విధంగా ప్రభుత్వం మీద ఒత్తిడి చేయడం కొరకు కృషి చేయాలని అన్నారు, తమ సమస్య పట్ల తెలంగాణ రాష్ట్రంలో ఏకైక కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి దీక్ష చేయుటకు ముందుకు రావడం సంతోషం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మురళీధర స్వామి, సుంకర వెంకటేశ్వర్లు, నిరంజన్ రెడ్డి, ఉమాదేవి, పద్మ, బిక్షం, చంద్రమౌళి, దర్గయ్య, విజయ్ కుమార్, ఏసురత్నం, బాలాజీ తదితరలు పాల్గొన్నారు.

## వీఎంఆర్ చిత్రకూట్ విద్యాశ్రమ్ హై స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఎక్స్‌పో–2026




ప్రజాస్ఫూర్తి, కాప్రా : కాప్రా డివిజన్ పరిధిలోని సాయిపురి కాలనీ, సైనిక్పురిలో ఉన్న వీఎంఆర్ చిత్రకూట్ విద్యాశ్రమ్ హై స్కూల్‌లో శనివారం సైన్స్ ఎక్స్‌పో-2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విజ్ఞాన విద్యకు ప్రాధాన్యతనిస్తూ "అన్వేషించు ఆవిష్కరించు తెలుసుకో" అనే నినాదంతో ఈ ఎక్స్‌పో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండారి లక్ష్మారెడ్డి హాజరై విద్యార్థులు రూపొందించిన శాస్త్రీయ నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే శాస్త్రంపై ఆసక్తి పెంపొందితే భవిష్యత్‌లో దేశాభివృద్ధికి తోడ్పడే శాస్త్రవేత్తలు తయారవుతారని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. సైన్స్ ఎక్స్‌పోలో విద్యార్థులు అంతరిక్ష విజ్ఞానం, యాంత్రిక మానవులు (రోబోటిక్స్), రసాయన శాస్త్ర ప్రయోగాలు, జీవశాస్త్ర నమూనాలు తదితర అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తల్లిదండ్రులు, సందర్శకులు విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా వీక్షించారు. ఈ కార్యక్రమంలో కాప్రా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బైరీ నవీన్ గౌడ్, నాయకులు రహీం, పాఠశాల యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ టైలర్స్ డే వేడుకలు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా రామవరం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామవరం మార్కెట్ లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 15వ డివిజన్ కార్పొరేటర్ ఆకునూరి సుప్రియ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో టైలర్ల పాత్ర కీలకమని, వారి శ్రమకు తగిన గౌరవం లభించాలని అన్నారు. అనంతరం సంఘానికి చెందిన సీనియర్ టైలర్లను సన్మానించి, వారి సేవలను అభినందించారు. మహిళా టైలర్లతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను మరింత ఆనందభరితంగా మార్చారు.సంఘం అధ్యక్షుడు బ్లూ మూన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రమేష్, కార్యదర్శి సబ్బని శ్రీను కార్యక్రమ నిర్వహణలో ముఖ్యపాత్ర పోషించారు. సీనియర్ టైలర్లు నర్సుమూర్తి, కొండల్, సురేష్ పాల్గొన్నారు.లేడీ టైలర్లు శ్రీవాణి, జుబేదా, ఆస్మా, రమాదేవి, కోమల, రోజా, సుజాత, స్వరూప హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాబోయే వైద్యులు గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించాలి

**: జిల్లా కలెక్టర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : కాబోయే వైద్యులు పట్టణ ప్రాంతం తో పాటు, గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడం పై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నల్గొండ ప్రభుత్వ వైద్య కళాశాల లో నిర్వహిస్తున్న వైద కళాశాల వార్షికోత్సవ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు .పట్టణ ప్రాంతంలో ప్రజలకు 75 శాతం నాణ్యమైన వైద్య సంరక్షణ సేవలు అందుబాటులో ఉన్నాయని,అయితే ఈ శాతం గ్రామీణ ప్రాంతంలో కేవలం 35% మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వపరంగా ఆరోగ్య సదుపాయాలతో పాటు, ప్రాథమిక వైద్యరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాల ద్వారా వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ, ఇంకా 65% మంది గ్రామీణ ప్రాంతంలో ప్రజలు సరైన వైద్యశాలుపొందలేకపోతున్నారని, అందువల్ల వైద్యులందరూ గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలు అందించడంపై దృష్టి సాధించాలని విజ్ఞప్తి చేశారు. ఎంబీబీఎస్ అంతంలేని చదువని, భవిష్యత్తులో పీజీ, స్పెషలైజేషన్ కి ఇది ఉపయోగపడుతుందని, అంతేకాక ఎంచుకున్న సబ్జెక్టులో నిష్ణాతులు కావాల్సిన అవసరం ఉందని, అందుకు వైద్య విద్యార్థులు భవిష్యత్తులో మంచి సబ్జెక్టులు ఎంచుకొని విజయం సాధించాలని ఆశించారు.అంతకు ముందు జిల్లా కలెక్టర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఏర్పాటు చేసిన నూతన జిమ్ ను ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు .

## పదవి విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులకు ఘనంగా సన్మానం



*** హాజరైన ఆర్టీసీ రీజనల్ డిప్యూటీ ఆర్ ఎం కవిత**

ప్రజాస్ఫూర్తి ప్రతినిధి: వనపర్తి జిల్లా : ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం పాటుపడి పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని టీ జి ఎస్ ఆర్ టి సి రీజినల్ డిప్యూటీ ఆర్ ఎం కవిత అన్నారు. వనపర్తి ఆర్టీసీ డిపోలో మెకానికల్, కండక్టర్, డ్రైవర్ విభాగాలలో నలుగురు ఉద్యోగులు రహీమ్, వివి మూర్తి, నీలయ్య,రాములు పదవీ విరమణ పొందిన సందర్భంగా శనివారం డిపో ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన సభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిప్యూటీ ఆర్ ఎం మాట్లాడుతూ దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు ఆర్టీసీ సంస్థలో వివిధ హోదాలలో పనిచేసి సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. ఆర్టీసీని కన్నతల్లిలా భావించి తాము బతుకుతూ సంస్థను బతికిస్తూ నీతి నిజాయితీతో వృత్తి ధర్మాన్ని పాటించి కుటుంబాల అభివృద్ధి కోసం పాటుపడడం గర్వించదగ్గ విషయం అన్నారు. అనుభవజ్ఞులైన ఉద్యోగులు పదవి విరమణ పొందుతుండడం కొంత బాధాకరమని అన్నారు. కొత్త జనరేషన్ కు స్ఫూర్తినిచ్చేలా మరి కొంతకాలం చిత్తశుద్ధితో పనిచేసే ఇలాంటి ఉద్యోగులు ఉంటే బాగుండేదని అభిప్రాయపడుతూ ఏ ఉద్యోగి కైనా రిటైర్మెంట్ తప్పనిసరి అయినందున పదవి విరమణ తీసుకోక తప్పదు అన్నారు. వృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించి నందు వల్లే ఎంతో మంది తోటి సహచరులు, మిత్రులు, బంధువుల ఆదరాభిమానాలు చూరగొన్నారని తెలిపారు. సమావేశానికి అధ్యక్షత వహించిన డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ మాట్లాడుతూ వనపర్తి డిపోలో పనిచేసిన ఉద్యోగులు సంస్థ కోసం అహర్నిశలు శ్రమించి మంచి పేరు తెచ్చి పెట్టారని ప్రశంసించారు. పదవి విరమణ పొందుతున్న ఉద్యోగుల సేవలను ఆయన కొనియాడారు.

*** నిజాయితీకి మారుపేరుగా నిలిచిన ఆర్టీసీ ఉద్యోగులు**

*** టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి జి మధు గౌడ్**

వనపర్తి ఆర్టీసీ డిపోలో నలుగురు ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ పొందిన సందర్భంగా జరిగిన సన్మాన సభ కు హాజరైన టి యు డబ్ల్యూజె ఐజెయు రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ మాట్లాడుతూ ఆర్టీసీ లో పనిచేసే ఉద్యోగులు సిబ్బంది నీతి నిజాయితీకి మారుపేరని అన్నారు. క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని కొనసాగించడంతోపాటు వారి కుటుంబాలు భావి తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఫలితంగానే ఆర్టీసీలో పనిచేసే ఉద్యోగుల పిల్లలు ఉన్నత చదువులలో రాణిస్తున్నారంటే ఆర్టీసీ లో అలవర్చుకున్న క్రమశిక్షణనే నని తెలిపారు. జర్నలిస్టులకు ఆర్టీసీకి మధ్య అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా కొల్లాపూర్ డిపో మేనేజర్ ఉమా శంకర్, వనపర్తి డిపోకు చెందిన పలువురు యూనియన్ నాయకులు,పదవి విరమణ పొందిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆర్టీసీకి కంకణ భక్తులై క్రమశిక్షణతో పనిచేసి కుటుంబాల అభ్యున్నతికి తోడ్పాటు అందించారని అన్నారు. తక్కువ పాటి జీతమైనా ఉన్నదాంట్లోనే సంతృప్తి పడుతూ కుటుంబాలను పోషించుకున్నారని తెలిపారు. పదవి రమణ అంతరం భావి జీవితం ఆనందమయంగా గడపాలని వారు ఆకాంక్షిస్తూ పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## ఎన్నాళ్ళో వేచిన ఉదయం..

*** ఎదురుచూసిన కళ్ళు.. ఎట్టకేలకు అందిన ఇళ్లు..**

*** డబల్ బెడ్ రూమ్ లు లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

*** ఆనందంలో షాద్ నగర్ లబ్ధిదారులు..**



ప్రజా స్ఫూర్తి ప్రతినిధి, షాద్నగర్ : ఎదురుచూసిన స్వప్నం ఎట్టకేలకు సాకారమైంది.. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన లబ్ధిదారుల చేతికి అందింది.. షాద్ నగర్ మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఎన్నాళ్లో వేచిన ఉదయం ఈనాడే ఎదురైంది. మార్చి మొదటి వారంలో పట్టాలు అందజేస్తామని, లబ్ధిదారులను గృహప్రవేశం చేయిస్తానని ఇటీవలే మీడియా ముందు మాట ఇచ్చిన ఎమ్మెల్యే మార్చి నెల ప్రారంభానికి ఒకరోజు ముందే ఇళ్ల పట్టాలను లాంఛనంగా అందజేశారు. లబ్ధిదారులకు 1,700 ఇళ్లను అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. పట్టణంలోని 28 వార్డుల నుంచి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అన్ని వార్డులలో ఎమ్మెల్యే శంకర్ చేతులమీదుగా కొంతమందికి లాంఛనంగా ఇళ్ల పట్టాలు ఇప్పించారు. మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందే మోహన్, ఆర్డీవో సరిత, తహసిల్దార్ నాగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డిలతో పాటు అన్ని వార్డులకు చెందిన కౌన్సిలర్ల సమక్షంలో ఈ ఇళ్ల పట్టాలను అందించారు. ఇళ్లలో అన్ని సదుపాయాలు కల్పించామని, ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులు గృహప్రవేశం చేయవచ్చని వెల్లడించారు. ఎక్కడ మంజూరైన వెళ్లాలని, ఒకవేళ అర్హులు ఎవరికైనా ఇల్లు రాకపోతే వారికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే ప్రయత్నం చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. పెద్ద ఎత్తున లబ్ధిదారులు ఈ కార్యక్రమానికి హాజరు కావడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. కౌన్సిలర్లు సర్వర్ పాషా, నడికూడ శ్రావణి, వోగ్గు జయలక్ష్మి, పెంటయ్య, రాజు నాయక్, స్థానిక నాయకులు అగనూరు విశ్వం, చెంది తిరుపతిరెడ్డి, సుజీవన్, దంగు శ్రీనివాస్, అగ్గనూరు నందు, ఇబ్రాహీం, జమాల్పూర్ చందు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

*** సదుపాయాల కోసమే జాప్యం.. : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయినప్పటికీ అక్కడ పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించే ఉద్దేశంతోనే లబ్ధిదారులకు ఇళ్లను అందించే విషయంలో జాప్యం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అప్పటికప్పుడు ఇల్లు అందజేయకపోవడం, మా ప్రభుత్వ హయాంలో కూడా సదుపాయాలకు నిధులు సేకరించే క్రమంలో జాపకం జరగడం వల్ల ఇళ్ల తలుపులు ఊడిపోయి, కిటికీల అద్దాలు పగిలిపోయి ఇబ్బందులు ఏర్పడ్డాయి అన్నారు. అదేవిధంగా అక్కడ కాలువలు ఏర్పాటు, విద్యుత్ ఏర్పాటు, తాగునీటి సదుపాయం వంటివి కూడా కల్పించవలసిన అవసరం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం ఎనిమిది కోట్ల నిధులతో వాటన్నింటిని పూర్తి చేయడం జరిగిందని స్పష్టం చేశారు. కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా దగ్గర ఉండి లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని సూచించారు. అక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువెళ్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గృహాలు అందించే విషయంలో పారదర్శకంగా ముందుకు వెళ్లామని స్పష్టం చేశారు. ప్రస్తుతం 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇంకా అర్హులకు ఇవ్వాల్సి ఉందని, ఇందిరమ్మ ఇల్లు అందని వారికి వాటిని అందించే ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.

## పంచశీల స్కూల్ లో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : మూసా పేట లోని పంచశీల స్కూల్ లో శనివారం జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శనలు ,విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్ విద్యార్థులు ప్రదర్శించిన పలు నమునాలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞాన శాస్త్రము పాట్ల జిజ్ఞాస కలగలి అని అన్నారు. సర్ సివి రామన్ యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మాగ్నెట్ పాఠశాలలో అట్టహాసంగా 'సైన్స్ డే' వేడుకలు

*** విద్యార్థుల ప్రయోగాల ప్రదర్శన అమోఘం**



ప్రజాస్ఫూర్తి ప్రతినిధి షాద్ నగర్ : స్థానిక మాగ్నెట్ పాఠశాల ఆవరణలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. విజ్ఞాన శాస్త్రం పట్ల విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఈ 'సైన్స్ ఎగ్జిబిషన్' సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి రూపొందించిన వివిధ రకాల సైన్స్ మోడల్స్ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

*** విద్యార్థుల ప్రతిభ అమోఘం: కరెస్పాండెంట్ ఎం.డి. వాజీద్**

ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల కరెస్పాండెంట్ ఎం.డి. వాజీద్ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, వినూత్న ఆలోచనలను వెలికితీసేందుకు ఇలాంటి వేదికలు ఎంతగానో దోహదపడతాయన్నారు. మాగ్నెట్ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ అమోఘం," అని కొనియాడారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై విద్యార్థులు పట్టు సాధించడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాల ప్రిన్సిపల్ ఆనంద్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎవరి సహాయం లేకుండా స్వతహాగా రకరకాల సైన్స్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించడం వారి ఆత్మవిశ్వాసాన్ని తెలియజేస్తుందన్నారు. సౌరశక్తి, పర్యావరణ పరిరక్షణ, రోబోటిక్స్, వ్యర్థాల నిర్వహణ, డార్క్ రూమ్ వంటి అంశాలపై విద్యార్థులు చేసిన ఎక్స్పరిమెంట్లు, వాటిని సందర్శకులకు వారు వివరించిన తీరు ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచిందని ఆయన వివరించారు.

**తల్లిదండ్రుల హర్షం**

ప్రతి ఏటా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం మాగ్నెట్ పాఠశాల ఇలాంటి వినూత్న కార్యక్రమాలను చేపట్టడంలో ఎప్పుడూ ముందుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. తమ పిల్లల్లోని ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ బృందాన్ని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో కరిక్యులం డైరెక్టర్ వినోద్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎండి ఆసిఫ్, ఉపాధ్యాయ బృందం మంజుల, మౌనిక, ఈశ్వరి, మహాలక్ష్మి, దివ్యశ్రీ, సిబ్బంది, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు.

## ఇంటర్మీడియట్ పరీక్షల కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా ఈనెల 25 తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షల సరళిని కలెక్టర్ శనివారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ, బయ్యారం మండల కేంద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా పరిశీలించారు,పరీక్షలు జరుగుతున్న తీరును స్వయంగా, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని, త్రాగునీరు అందించాలని సూచించారు, సీసీ కెమెరాల ద్వారా నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు,జిల్లాలో (18) పరీక్ష కేంద్రాల ద్వారా మొదటి సంవత్సరం 4158, రెండవ సంవత్సరం 4129, మొత్తం 8287 విద్యార్థిని, విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారని, శనివారం (3822) మంది పరీక్షలకు హాజరు కాగా, (65) మంది గైజరయ్యారు,ఇప్పటికే పరీక్షల నిర్వహణపై ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ, సమావేశాలు నిర్వహించి పకడ్బందీగా ఏర్పాట్లు చేసామని, ప్రతీ కేంద్రానికి చీఫ్ సూపర్డెంట్స్, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష జరిగే సమయాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించడంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో ముందుకు సాగుతుందని ఆమె తెలిపారు, ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సిహెచ్.మదర్, సంబంధిత సిబ్బంది ఉన్నారు

## టిజిఓ రంగారెడ్డి జిల్లా అంతర్జాతీయ మహిళా దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




రంగారెడ్డి, ప్రజాస్ఫూర్తి : రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం మహిళా విభాగం చైర్ పర్సన్ రేవతి ఆధ్వర్యంలో శనివారం టీజీఓ ఎస్ భవన్ లో రంగారెడ్డి జిల్లా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉత్సవాల పోస్టర్ ను టీజీఓ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ రామారావు,కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి,మహిళా విభాగం రాష్ట్ర కోశాధికారి శాంతి శ్రీ, శిరీష, నరహరి, షౌకత్ తదితరులు పాల్గొన్నారు

# పెట్టుబడులు పెట్టండి..

## బడ్జెట్ ప్రయోజనాలు పొందండి

## పారిశ్రామిక వేత్తలకు ప్రధాని పిలుపు



**న్యూఢిల్లీ:** ప్రభుత్వం మూలధన వ్యయాలు పెంచుతున్న తరుణంలో, అంతర్జాతీయంగా పోటీ పడేందుకు ప్రైవేటు రంగమూ వినూత్న ఉత్పత్తుల కోసం పెట్టుబడులు అధికం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు. 'సాంకేతికత, సంస్కరణలు, వికసిత్ భారత్ కోసం ఆర్థిక లక్ష్యాల' పేరిట, బడ్జెట్ తరవాత శుక్రవారం నిర్వహించిన తొలి వెబినార్‌లో ప్రధాని ప్రసంగించారు. 11 ఏళ్ల క్రితం రూ. 2 లక్షల కోట్లుగా ఉన్న మూలధన పెట్టుబడులు, 2026-27 బడ్జెట్‌లో రూ. 12 లక్షల కోట్లకు పెరిగాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ప్రైవేటు రంగం కూడా దేశ వృద్ధి కోసం తాజా పెట్టుబడులు పెట్టాలని, ఆవిష్కరణలు తేవాలని ప్రధాని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక సంస్థలు, విశ్లేషకులు ఆచరణాత్మక పరిష్కారాలు సూచించి, మార్కెట్‌లో విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. ప్రభుత్వం, పరిశ్రమ, నిపుణులు కలిసినప్పుడే సంస్కరణలు చక్కని ఫలితాన్నిస్తాయని మోదీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, ఆర్థిక పథకాల్లో వినూత్నతకు అధిక ప్రాధాన్యమివ్వాలని వివరించారు. ప్రాజెక్టుల మంజూరు పద్ధతులను బలోపేతం చేసి, నాణ్యతకు పెద్దపీట వేయాలని తెలిపారు. జాతీయ రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, డిజిటల్ మౌలిక వసతులు, ఇంధన నెట్‌వర్క్ అభివృద్ధిని ప్రధాని ప్రస్తావించారు. కృత్రిమమేధ (ఏఐ), బ్లాక్‌చెయిన్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతికతల వినియోగం ద్వారా పారదర్శకత, వేగం, జవాబుదారీతనం పెంచాలని ప్రధాని ఉద్బోధించారు. అప్పుడే బడ్జెట్‌లోని అంశాలు కార్యరూపం దాలుస్తాయని పేర్కొన్నారు. 'రుణ లభ్యతను సరళతరం చేసి, సులభతర వాణిజ్య వాతావరణాన్ని మెరుగుపరచాలి. ప్రజల జీవనం మరింత నాణ్యంగా ఉండాల'ని ప్రధాని తెలిపారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. అందరి సమష్టికృషితోనే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతావని సాకారం అవుతుందని చెప్పారు.

# మాట వినలేదని ఆంథ్రోపిక్‌ను వెళ్లగొట్టిన ట్రంప్..

## ఓపెన్‌ఏఐతో అగ్రిమెంట్



**న్యూయార్క్:** అమెరికా రక్షణశాఖ డిమాండ్లకు నో చెప్పిన ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్‌తో వ్యాపారం చేయబోమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ టెక్నాలజీని వాడడం వెంటనే ఆపేయాలని అన్ని ప్రభుత్వ ఏజెన్సీలను ఆదేశించారు. అదే సమయంలో ఆంథ్రోపిక్ ప్రత్యర్థి సంస్థ ఓపెన్‌ఏఐతో పెంటగాన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ వెల్లడించారు.

ఆంథ్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ను సైన్యం అపరిమితంగా వాడుకునేలా యాక్సెస్ ఇవ్వాలని పెంటగాన్ డిమాండ్ చేసింది. అందుకు శుక్రవారం వరకు గడువు విధించింది. అయితే అది ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. ఆ సంస్థతో మరోసారి వ్యాపారం చేయమని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే ఓపెన్ ఏఐ ఎంటర్ అయింది.

"అమెరికా రక్షణశాఖతో నిన్న ఒప్పందం కుదుర్చుకున్నాం. ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించడంపై మా మధ్య చర్చ జరిగింది. ఇరువర్గాలు అంగీకారానికి వచ్చిన పరిమితుల్లోనే ఏఐ మోడల్స్ పనిచేస్తాయని నిర్ధరించేందుకు సాంకేతికపరమైన విధానాలను ప్రవేశపెట్టనున్నాం" అని ఆల్టమన్ వెల్లడించారు.

### బెదిరింపులు పట్టించుకోం: ఆంథ్రోపిక్

బెదిరింపులు ఎన్ని వచ్చినా తమ విధానాల్లో ఎలాంటి మార్పు ఉండదని ఆంథ్రోపిక్ ఓ ప్రకటనలో వెల్లడించింది. నిఘా, మిలిటరీ వ్యవహారాల్లో అపరిమిత ఏఐ వినియోగానికి సంబంధించిన నైతిక నిబంధనలను ఉల్లంఘించలేమని స్పష్టం చేసింది.

# 'జీడీపీ' గణాంకాలు మారాయ్

## 2025-26కు వృద్ధి అంచనా 7.6%

## అక్టోబరు-డిసెంబరులో వృద్ధి 7.8 శాతానికి

## కొత్త సిరీస్ అమలు నేపథ్యం




**న్యూఢిల్లీ:** మనదేశం అమల్లోకి తెచ్చిన కొత్త జీడీపీ సిరీస్ కారణంగా వృద్ధిరేటు అంచనాలు, వృద్ధి గణాంకాల్లో మార్పులొచ్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి అంచనాను అంతక్రితం అంచనా అయిన 7.4% నుంచి 7.6 శాతానికి సవరించారు. లెక్కింపు పద్ధతులను ప్రభుత్వం సవరించడం ఇందుకు నేపథ్యం. ప్రాతిపదిక ఏడాదిని 2011-12 నుంచి 2022-23 ఆర్థిక సంవత్సరానికి మార్చారు. దీంతోపాటు జీఎస్టీ, ఇ-వాహన్ పోర్టల్ నుంచి అదనపు గణాంకాలను జత చేయడం ద్వారా, ఆర్థిక కార్యకలాపాలను మెరుగ్గా ప్రతిబింబించేలా కొత్త సిరీస్ తీసుకొచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.

శుక్రవారం గణాంక, పథకాల అమలు శాఖ (మోస్పి) 'న్యూ సిరీస్ ఆఫ్ యాన్యువల్ అండ్ క్వార్టర్లీ నేషనల్ అకౌంట్స్ ఎస్టిమేట్స్'ను విడుదల చేసింది. అంతక్రితం ఉన్న పాత సిరీస్‌ను ఇది భర్తీ చేసింది. జీడీపీ సిరీస్‌కు ఇది తొమ్మిదో ప్రాతిపదిక సవరణ. దీని ప్రకారం..

2025-26 మూడో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతానికి చేరింది. 2024-25 ఇదే సమయంలో ఇది 7.4%. తయారీ, సేవల రంగాలు రాణించడం ఇందుకు కలిసొచ్చింది. రెండో త్రైమాసిక (జులై-సెప్టెంబరు) వృద్ధి రేటు పాత సిరీస్‌లోని 8.2% నుంచి 8.4 శాతానికి చేరింది. తొలి త్రైమాసికంలో మాత్రం 7.8% నుంచి 6.7 శాతానికి తగ్గింది.

ఈ మార్పుల కారణంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి వాస్తవ జీడీపీ (స్థిర ధరల వద్ద) రూ.322.58 లక్షల కోట్లకు చేరుతుందని అంచనా. 2024-25లో తొలి సవరించిన అంచనా(ఎఫ్ఆర్ఈ) రూ.299.89 లక్షల కోట్లుగా ఉంది. దీంతో 2025-26లో వాస్తవ జీడీపీ వృద్ధి 7.6% అవుతుందని అంచనా. 2024-25లో ఇది 7.1%. 2025-26 నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీ 8.6 శాతానికి చేరొచ్చు.



# రంజీ ట్రోఫీలో కొత్త ఛాంపియన్..

## చరిత్ర సృష్టించిన జమ్మూ కశ్మీర్

## తొలిసారి రంజీ ట్రోఫీ విజేతగా అవతరించిన జమ్మూ కశ్మీర్

## ఫైనల్లో కర్ణాటకపై తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో చారిత్రక గెలుపు

## తొలి ఇన్నింగ్స్‌లో శుభమ్ పుండిర్, రెండో ఇన్నింగ్స్‌లో కమ్రాన్, లోత్రా సెంచరీలు

## ఐదు వికెట్లతో చెలరేగిన అకిబ్ నబీ

## 67 ఏళ్ల టోర్నీ చరిత్రలో జమ్మూ కశ్మీర్‌కు ఇదే తొలి టైటిల్

**హుబ్లీ:** భారత దేశవాళీ క్రికెట్‌లో జమ్మూ కశ్మీర్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలిసారి రంజీ ట్రోఫీని ముద్దాడింది. హుబ్లీ వేదికగా ముగిసిన ఫైనల్లో 8 సార్లు ఛాంపియన్ అయిన కర్ణాటకతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. అయితే, కీలకమైన తొలి ఇన్నింగ్స్‌లో సాధించిన 291 పరుగుల భారీ ఆధిక్యంతో జమ్మూ కశ్మీర్ విజేతగా నిలిచింది. ఈ చారిత్రక గెలుపుతో జట్టు సభ్యులు, అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న జమ్మూ కశ్మీర్.. అద్భుతమైన ప్రదర్శన చేసింది. శుభమ్ పుండిర్ (117) రంజీ ఫైనల్లో సెంచరీ చేసిన తొలి కశ్మీర్ బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. అతనికి యావర్ హసన్ (88), కనిష్క వధావన్ (70), సాహిల్ లోత్రా (72) వంటి ఆటగాళ్లు తోడవడంతో జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో ఏకంగా 584 పరుగుల భారీ స్కోరు సాధించింది. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ ఐదు వికెట్లు తీసినప్పటికీ, కశ్మీర్ బ్యాటర్లను కట్టడి చేయలేకపోయాడు.



అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్ణాటకను జమ్మూ కశ్మీర్ బౌలర్లు వణికించారు. ముఖ్యంగా అకిబ్ నబీ దార్ (5/54) నిప్పులు చెరిగే బంతులతో ఐదు వికెట్లు పడగొట్టి కర్ణాటక పతనాన్ని శాసించాడు. కెప్టెన్ మయాంక్ అగర్వాల్ (160) ఒంటరి పోరాటం చేసినా మిగతా బ్యాటర్లు విఫలం కావడంతో కర్ణాటక 293 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో జమ్మూ కశ్మీర్‌కు నిర్ణయాత్మకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

ఇక, రెండో ఇన్నింగ్స్‌లోనూ జమ్మూ కశ్మీర్ బ్యాటర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. ఓపెనర్ కమ్రాన్ ఇక్బాల్ (160 నాటౌట్), సాహిల్ లోత్రా (101 నాటౌట్) అజేయ సెంచరీలతో కర్ణాటక ఆశలపై పూర్తిగా నీళ్లు చల్లారు. జమ్మూ కశ్మీర్ 342/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయడంతో నిబంధనల ప్రకారం మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో జమ్మూ కశ్మీర్ విజేతగా నిలిచింది. తమ తొలి ఫైనల్ ఆడుతున్నప్పటికీ ఎక్కడా ఒత్తిడికి గురికాకుండా సమష్టిగా రాణించి చారిత్రక విజయాన్ని అందుకుంది.

# తొలి వరల్డ్‌కప్ హీరోకు ప్రత్యేక గౌరవం..

## వాంఖడే పెవిలియన్ ఆయనదే..!



**వాంఖడే:** భారత దిగ్గజం రవి శాస్త్రికి ప్రత్యేక గౌరవం లభించనుంది. తొలి వరల్డ్‌కప్ హీరో రవి గౌరవార్థం పెవిలియన్ ఏర్పాటు చేయాలని ముంబై క్రికెట్ సంఘం సంకల్పించింది. ప్రస్తుతం పొట్టి కప్‌లో కామెంటేటర్‌గా అలరిస్తున్న రవి పేరును వాంఖడే మైదానంలోని లెవల్ 1 స్టాండ్‌కు ఖరారు చేశామని ఎంసీఏ ఒక ప్రకటనలో తెలిపింది. క్రికెట్ లెజెండ్‌కు ఈ గౌరవం దక్కడం పట్ల అభిమానులు, మాజీ ఆటగాళ్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తమదైన ఆటతో భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన ఆటగాళ్లు చాలామంది. సుదీర్ఘ కాలం సేవలందించి.. క్రికెట్ వ్యాప్తికి తోడ్పడిన ఈ దిగ్గజాలను ఆయా రాష్ట్ర క్రికెట్ సంఘాలు గొప్పగా గౌరవిస్తుంటాయి. ఈ క్రమంలోనే వారి పేరు మైదానంలో నిలిచిపోయేలా స్టాండ్స్ ఏర్పాటు చేస్తుంటాయి. ముంబై క్రికెట్ సంఘం కూడా ఇప్పుడు లెజెండ్ రవి శాస్త్రి పేరుతో పెవిలియన్ ఏర్పాటు చేయనుంది. ఈ విషయాన్ని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించాడు.

'దిగ్గజ ఆటగాళ్లు వేసిన పునాదులపైనే ముంబై క్రికెట్ నిర్మితమైంది. దేశానికి, ముంబై పట్టణానికి గౌరవం, గుర్తింపు తీసుకొచ్చిన మేటి క్రికెటర్లను గౌరవించడం మా బాధ్యత. వాంఖడే మైదానంలో ప్రెస్ స్టాండ్‌కు పక్కనే ఉండే లెవల్ 1 స్టాండ్‌కు రవి శాస్త్రి పేరు పెడుతున్నాం. ఈ విషయాన్ని మీతో పంచుకుంటున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అని అజింక్యా నాయక్ పేర్కొన్నాడు. శాస్త్రి పేరును స్టాండ్స్‌కు ఖరారు చేయగా.. వాంఖడేలోని మూడు గేట్లకు వెటరన్స్ దిలీప్ సర్దేశాయ్, ఏక్‌నాథ్ సోల్కర్, దయాని ఎదుల్జి పేర్లు పెడుతున్నట్టు ఎంసీఏ తెలిపింది.

### 80 టెస్టులు, 150 వన్డేలు

దేశవాళీ క్రికెట్‌లో ముంబైకి ఆడిన రవి శాస్త్రి.. ఆపై భారత జట్టులో కీలక ఆటగాడిగా ఎదిగాడు. 1983లో వన్డే వరల్డ్‌కప్ విజేతగా అవతరించిన కపిల్ డెవిల్స్ జట్టులో శాస్త్రి సభ్యుడు. 80 టెస్టులు, 150 వన్డేల్లో భారత్‌కు ప్రాతినిధ్య వహించిన ఈ వెటరన్ క్రికెటర్.. ఆపై కోచ్‌గానూ మెప్పించాడు. 2017 నుంచి 2021 మధ్య టీమిండియాను గొప్పగా తీర్చిదిద్దాడు. అతడి హయాంలోనే.. భారత్ నంబర్ 1 జట్టుగా నిలిచింది. అంతేకాదు ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్ గెలుపొందింది.

# సూర్యకుమార్‌ను వెనక్కి నెట్టి..

## ఐసీసీ అవార్డు గెలుచుకున్న కివీస్ ఆల్‌రౌండర్

## ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డుల ప్రకటన

## పురుషుల విభాగంలో న్యూజిలాండ్ ఆటగాడు డారిల్ మిచెల్

## మహిళల విభాగంలో బంగ్లాదేశ్ ప్లేయర్ శోభన మొస్తరీ

## భారత్‌పై వన్డే సిరీస్‌లో అద్భుత ప్రదర్శనకు మిచెల్‌కు పురస్కారం

## టీ20 ప్రపంచకప్ క్వాలిఫయర్‌లో రాణించినందుకు శోభనకు గౌరవం

**న్యూఢిల్లీ:** ఐసీసీ ప్రతి నెలా ప్రకటించే 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డులను తాజాగా ప్రకటించింది. పురుషుల విభాగంలో న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ డారిల్ మిచెల్, మహిళల విభాగంలో బంగ్లాదేశ్ బ్యాటర్ శోభన మొస్తరీ ఈ పురస్కారాలను గెలుచుకున్నారు. భారత్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచినందుకు మిచెల్‌కు, ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ గ్లోబల్ క్వాలిఫయర్‌లో రాణించినందుకు శోభనకు ఈ గౌరవం దక్కింది.



భారత్ పర్యటనలో న్యూజిలాండ్ జట్టు మూడు వన్డేల సిరీస్‌లో 0-1తో వెనుకబడిన దశలో డారిల్ మిచెల్ అసాధారణ పోరాటపటిమ చూపించాడు. వరుసగా రెండు మ్యాచ్‌లలో సెంచరీలు సాధించి ఒంటిచేత్తో జట్టుకు సిరీస్ విజయాన్ని అందించాడు. రెండో వన్డేలో 131 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన మిచెల్, సిరీస్ నిర్ణయాత్మక మూడో వన్డేలో 137 పరుగులు చేసి కివీస్ 337 పరుగుల భారీ స్కోరు సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో న్యూజిలాండ్ 2-1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

ఈ సిరీస్‌లో మొత్తం 352 పరుగులు చేసిన మిచెల్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా కూడా నిలిచాడు. ఈ ప్రదర్శనతో ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి నంబర్ 1 స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ అవార్డు రేసులో భారత స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్, ఇంగ్లండ్ ఆటగాడు జో రూట్‌లను అధిగమించి మిచెల్ విజేతగా నిలవడం విశేషం.

# విండీస్‌తో భారత్ డూ ఆర్ డై..

## పరుగుల పిచ్‌పై అసలు సిసలు ఫైట్!

## భారత్, వెస్టిండీస్ మధ్య వర్చువల్ క్వార్టర్ ఫైనల్ పోరు

## ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల వరద పారిన పిచ్‌పై మ్యాచ్

## స్పిన్నర్లు, పేసర్లకు పిచ్ నుంచి సహకారం లభించే అవకాశం

## పిచ్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన క్యాబ్ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ

## ఇప్పటికే ఈ మైదానంలో రెండు మ్యాచ్‌లు గెలిచిన వెస్టిండీస్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో రేపు భారత్, వెస్టిండీస్ మధ్య జరగనున్న మ్యాచ్ వర్చువల్ క్వార్టర్ ఫైనల్‌గా మారింది. ఈ కీలకమైన సూపర్-8 పోరుకు కోల్‌కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ ఆతిథ్యం ఇస్తుండగా, టోర్నీలో తొలిసారి 200 పైచిలుకు స్కోరు నమోదైన పిచ్‌పైనే ఈ మ్యాచ్ నిర్వహించనుండటం తీవ్ర ఆసక్తి రేపుతోంది. ఇందులో గెలిచిన జట్టు సెమీస్ రేసులో ముందంజ వేయనుండగా, ఓడిన జట్టు దాదాపుగా ఇంటిముఖం పట్టనుంది.





క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ బెంగాల్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ఈ పిచ్‌ను క్షుణ్ణంగా పరిశీలించాడు. బీసీసీఐ చీఫ్ క్యూరేటర్ ఆశిష్ భౌమిక్‌తో కలిసి స్థానిక క్యూరేటర్ సుజన్ ముఖర్జీతో గంగూలీ చాలాసేపు చర్చించాడు. పిచ్ తయారీపై గంగూలీ సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. "ఇది పరుగుల వరద పారించే ఈడెన్ వికెట్. అయితే, బౌలర్లకు కూడా ఎంతో కొంత సహకారం లభిస్తుంది" అని సుజన్ ముఖర్జీ పీటీఐకి తెలిపాడు. మ్యాచ్‌పై మంచు ప్రభావం కూడా గణనీయంగా ఉంటుందని పేర్కొన్నాడు.

ఇదే పిచ్‌పై ఈ నెల 9న జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టు ఇటలీపై 207/4 భారీ స్కోరు సాధించింది. ఆ మ్యాచ్‌లో ఆఫ్ స్పిన్నర్ మైఖేల్ లీస్క్ 4/17 ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. పిచ్ పొడిగా ఉండే అవకాశం ఉన్నందున, స్పిన్నర్లు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అదే సమయంలో ఈడెన్ పిచ్‌లో మంచి బౌన్స్, క్యారీ కూడా లభిస్తుండటంతో భారత పేస్ గుర్రం జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌తో పాటు హార్దిక్ పాండ్యా కూడా రాణించేందుకు ఆస్కారం ఉంది.

ఈ టోర్నీలో భారత జట్టు ఈడెన్‌లో ఆడటం ఇదే తొలిసారి. కాగా, వెస్టిండీస్‌కు ఇది స్వల్ప ప్రయోజనం చేకూర్చే అంశం. విండీస్ ఇప్పటికే ఈ మైదానంలో స్కాట్లాండ్, ఇటలీలపై రెండు మ్యాచ్‌లు ఆడి రెండింటిలోనూ విజయం సాధించింది. గత మ్యాచ్‌లలో దక్షిణాఫ్రికా చేతిలో వెస్టిండీస్ ఓడిపోవడం, జింబాబ్వేపై భారత్ గెలవడంతో ఈ సూపర్-8 మ్యాచ్ ఇరు జట్లకు 'డూ ఆర్ డై'గా మారింది.

MOVIE TIME

# 42 ఏళ్ల వయసులో రీఎంట్రీ..



టాకీస్: తెలుగులో వాన సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించింది మీరా చోప్రా. ఆ తర్వాత పవన్ కళ్యాణ్ నటించిన బంగారం సినిమాలో నటించింది. అందం, అభినయంతో మెప్పించినప్పటికీ ఈ బ్యూటీకి తెలుగులో అంతగా అవకాశాలు రాలేదు. ఎస్.జె. సూర్య నటించిన 'అన్బే ఆరుయిరే' చిత్రం 2005లో విడుదలైంది. ఈ చిత్రం ద్వారా కథానాయికగా మీరా చోప్రా తమిళ సినిమాలో నటిగా అడుగుపెట్టింది. ఇప్పుడు, ఆమె గుర్తుపట్టలేని ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఢిల్లీలో చదువుకున్న నటి మీరా చోప్రా బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రాకి బంధువు. నటి ప్రియాంక చోప్రా మొదటి సినిమా కూడా తమిళంలోనే. అదేవిధంగా, మీరా చోప్రా కూడా తమిళంలో తన మొదటి సినిమా ఇచ్చింది. 'అన్బే ఆరుయిరే' సినిమా తర్వాత, పవన్ కళ్యాణ్ నటించిన 'బంగారం' అనే తెలుగు సినిమాలో నటించింది.

తెలుగులో కంటే ఎక్కువగా తమిళంలో వరుస సినిమాలతో అలరించింది. శింబు నటించిన 'కాళై' చిత్రం మీరా చోప్రా కెరీర్‌లో ల్యాండ్‌మార్క్ చిత్రంగా నిలిచింది. తెలుగు, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించింది. మీరా చోప్రా చివరిగా 2015లో భరత్ నటించిన 'ఖిల్లాడి' చిత్రంలో నటించింది. ఆ తర్వాత ఆమె తమిళ సినిమాలో ఏ సినిమాలోనూ నటించలేదు. ఇప్పుడు 42 ఏళ్ల వయసులో, ఆమె తమిళ సినిమాలోకి రీఎంట్రీ ఇస్తుంది. అయితే హీరోయిన్‌గా కాదు.. నిర్మాతగా. విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి నటించిన 'గాంధీ టాక్స్' చిత్రాన్ని నటి మీరా చోప్రా నిర్మించారు, ఈ చిత్రం జనవరి 30న విడుదలైంది. భవిష్యత్తులో ఆమె తమిళ చిత్రాలలో నటించవచ్చని అంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉండే మీరా చోప్రా తాజా ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# నూతన దంపతులకు కానుక..


'రణబాలి'లోని ఎందయ్య సామి పాట విడుదల

విజయ్ దేవరకొండ, రష్మికలకు 'రణబాలి' చిత్రబృందం స్పెషల్ సర్‌ప్రైజ్

సినిమా నుంచి 'ఎందయ్య సామి' రొమాంటిక్ మెలోడీ విడుదల


అజయ్-అతుల్ సంగీతం.. ఐదు భాషల్లో వచ్చిన పాట

సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల




టాకీస్: టాలీవుడ్ స్టార్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నలకు వారి కొత్త సినిమా టీమ్ నుంచి ఓ స్పెషల్ సర్‌ప్రైజ్ అందింది. ఇటీవలే వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంటకు కానుకగా, వారు నటిస్తున్న 'రణబాలి' చిత్రం నుంచి ఓ రొమాంటిక్ మెలోడీ సాంగ్‌ను చిత్రబృందం విడుదల చేసింది. "ఎందయ్య సామి" అంటూ సాగే ఈ పాటను శనివారం రిలీజ్ చేశారు.

రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. ఇందులో విజయ్ 'రణబాలి' అనే పవర్‌ఫుల్ పాత్రలో, రష్మిక 'జయమ్మ'గా కనిపించనున్నారు. తాజాగా విడుదలైన "ఎందయ్య సామి" పాటకు ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ స్వరాలు సమకూర్చారు. ఈ పాటలో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పండిందని, వారిద్దరినీ చూస్తుంటే 'గీత గోవిందం' రోజులు గుర్తుకొస్తున్నాయని అభిమానులు సోషల్ మీడియాలో



కామెంట్స్ చేస్తున్నారు.

ఈ మెలోడీని తెలుగుతో పాటు తమిళ, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో ఏకకాలంలో విడుదల చేశారు. ఇదిలా ఉంటే, ఈ సినిమాలో 'ది మమ్మీ' ఫేమ్, హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఒక కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు.



# వెంకటప్పనాయుడుగా మోహన్ బాబు

**టాకీస్:** కలెక్షన్ కింగ్ డాక్టర్ మోహన్ బాబు మరోసారి వెండితెరపై తన గంభీరమైన నటనతో అలరించబోతున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగపురం' అనే క్రేజీ ప్రాజెక్ట్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మోహన్ బాబు పోషిస్తున్న 'వెంకటప్పయ్య నాయుడు' పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో మోహన్ బాబు లుక్ ఎంతో పవర్ ఫుల్ గా, రాజసంతో ఉట్టిపడుతోంది. గర్వం, ధైర్యం కలగలిసిన ఒక గంభీరమైన పాత్రలో ఆయన కనిపించబోతున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. 'మహాసముద్రం', 'మంగళవారం' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న దర్శకుడు అజయ్ భూపతి, మోహన్ బాబును ఒక సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని వెండితెరకి పరిచయం కాబోతుండగా.. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాశా థడాని హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాతలు అశ్వినీదత్, జెమిని కిరణ్ ఈ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నాడు.

# హుషారు పిట్టలు నుంచి మంగళస్నానం పాట విడుదల

**టాకీస్:** అన్ను మరియు వాసవి గణేశిషన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిల్మ్స్ విడుదల చేస్తుండటంతో ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌కు భారీ స్పందన రాగా, తాజాగా ఈ చిత్రం నుంచి 'మంగళస్నానం' అనే హార్ట్ టచింగ్ ఎమోషనల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పాట ఒక తండ్రి తన కూతురిని ఎంత అల్లారుముద్దుగా పెంచుకుంటారో, ఆమెపై ఎంతటి ప్రాణాన్ని పెట్టుకుంటారో అద్భుతంగా ఆవిష్కరించింది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే విడదీయలేని అనుబంధానికి ఈ గీతం అద్దం పడుతోంది. ఎస్.ఎస్. చిరంజన్ హృద్యమైన సాహిత్యం అందించగా, యోగి సురేష్ మరియు విహా తమ గాత్రంతో ప్రాణం పోశారు. చరణ్ అర్జున్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన



ఆకర్షణగా నిలిచింది. పాట విడుదల సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 'తండ్రీకూతుళ్ల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమను ఈ పాటలో చూపించాం. ఈ సినిమా కేవలం యువతకే కాదు, తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక చక్కని కుటుంబ కథా చిత్రం. నా నిజ జీవితంలో నేను చూసిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించాను. యువతకు కావాల్సిన హుషారును ఇస్తూనే, ఒక సరికొత్త థ్రిల్‌ను ఈ సినిమా పంచుతుంది' అని తెలిపారు.

# స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల




టాకీస్: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది.

ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో-అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో పాటు పోలీస్ డ్రామా ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు టీజర్ సూచిస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.